# ప్రజల విశ్వాసం పొందడంలో సిఎం విఫలం

## మాజీ మంత్రి జీవన్ రెడ్డి



**ప్రజాపక్షం/జగిత్యాల :** ప్రజల విశ్వాసం పొందడంలో సిఎం రేవంత్ రెడ్డి విఫలమవుతున్నారని మాజీ మంత్రి జీవన్ రెడ్డి ఆరోపించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో గురువారం రిటైర్డ్ ఉద్యోగుల సంఘ నాయకులతో జీవన్ రెడ్డి ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సిఎం స్వయంగా అన్ని జిల్లాల్లో పర్యటించినప్పటికి అల్ఫోర్స్ అధినేత నరేందర్ రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించుకోలేదన్నారు. అధికార పార్టీని వదిలి ప్రశ్నించే గొంతుకగా ప్రజల్లోకి వచ్చానని నిన్నటి వరకు ఒక లెక్క ఇప్పటినుంచి మరో లెక్కగా రాజకీయ జీవితం ఉంటుందన్నారు. రిటైర్డు ఉద్యోగుల సమస్యలపై తన వంతుగా పోరాటం చేస్తానన్నారు. ఈ సమావేశంలో రిటైర్డు ఉద్యోగుల సంఘం నాయకులు రవీందర్, గంగాధర్, మల్లిఖార్జున్, మిసాక్ అహ్మద్ తదితరులు ఉన్నారు.


ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

శుక్రవారం | 27 మార్చి, 2026 | పేజీలు :08


# నిర్మల్‌లో రగిలిన వైద్య లోకం!

### డాక్టర్ సంతోష్‌పై దాడికి నిరసనగా రోడ్లపైకి ఐఎంఏ!

### వైద్యుడిపై అమానుష దాడి.. నిందితులను అరెస్ట్ చేయాలంటూ ఆర్యవైశ్యుల ముట్టడి!

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:** నిర్మల్ పట్టణంలో శాంతిభద్రతలు మచ్చుకైనా కనిపించడం లేదా? ప్రాణాలు కాపాడే వైద్యుడిపైనే దాడులు సాగుతుంటే రక్షణ కరువైందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ప్రముఖ శిశువైద్యులు డాక్టర్ సంతోష్ కుమార్‌పై ఒక వర్గానికి చెందిన వ్యక్తులు పట్టపగలు అమానుషంగా భౌతిక దాడికి తెగబడటం పట్టణంలో పెను సంచలనంగా మారింది. ఈ దాడిని నిరసిస్తూ పట్టణంలోని వైద్యులందరూ విధులను బహిష్కరించి రోడ్లపైకి రావడం, వారికి ఆర్యవైశ్య సంఘాలు అండగా నిలవడంతో నిర్మల్ ప్రధాన రహదారి నిరసన జ్వాలలతో రణరంగాన్ని తలపిస్తోంది.

**వివాదానికి కారణం: బిల్లుల ఒత్తిడా? సి.ఎం.ఆర్.ఎఫ్ దందానా?:** ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగికి సంబంధించిన బిల్లు చెల్లింపు విషయంలో తలెత్తిన వివాదం చిలికి చిలికి గాలివానలా మారింది. అయితే, దీని వెనుక మరో బలమైన కారణం ఉన్నట్లు సమాచారం. ముఖ్యమంత్రి సహాయ నిధి (CMRF) నిధుల కోసం ఆస్పత్రి బిల్లును వాస్తవం కంటే అధికంగా పెంచి చూపాలని కొందరు వ్యక్తులు డాక్టర్ సంతోష్‌పై తీవ్ర ఒత్తిడి తెచ్చారని, దానికి ఆయన నిరాకరించడంతోనే ఈ అమానుష దాడి జరిగిందని ఆర్యవైశ్య సంఘం నాయకులు ఆరోపిస్తున్నారు. విధి నిర్వహణలో ఉన్న డాక్టరును టార్గెట్ చేస్తూ అమానుషంగా కొట్టడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**పోలీసుల తీరుపై విచారకరం.. మూడు గంటల నిరీక్షణ!:** ఈ వివాదం ఇంతలా ముదరడానికి ప్రధాన కారణం పోలీసుల ఉదాసీన వైఖరేనని బాధితులు మరియు నిరసనకారులు మండిపడుతున్నారు. దాడి జరిగిన వెంటనే డాక్టర్ సంతోష్ కుమార్ గారు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ, మూడు గంటలు గడుస్తున్నా అధికారులు స్పందించకపోవడంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. నిందితుల వివరాలు స్పష్టంగా తెలిసినప్పటికీ, వారిని అదుపులోకి తీసుకోవడంలో పోలీసులు ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గి నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని నిరసనకారులు సూటిగా ప్రశ్నిస్తున్నారు. పోలీసుల ఈ తాత్సారమే వైద్యులను, ఆర్యవైశ్యులను రోడ్లపైకి వచ్చేలా చేసింది. **స్తంభించిన వైద్య సేవలు.. రోడ్లపైనే భైఠాయింపు:** డాక్టర్ సంతోష్ కుమార్‌కు మద్దతుగా పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రులన్నీ ఓపిడి (OPగా) సేవలను నిలిపివేశాయి. డాక్టర్లందరూ తమ ఆస్పత్రులను మూసివేసి, తెల్ల కోట్లు ధరించి ప్రధాన రహదారిపై ధర్నాలో పాల్గొన్నారు. వందలాది మందితో కూడిన ఈ నిరసనతో నిర్మల్ ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్



పూర్తిగా స్తంభించిపోయింది. నిందితులను వెంటనే అరెస్ట్ చేసి, వారిపై కఠినమైన 'మెడికల్ ప్రొటెక్షన్ యాక్ట్' కింద కేసులు నమోదు చేయాలని వారు భీష్మించుక కూర్చున్నారు. ప్రైవేట్ ఆస్పత్రులు మూతపడటంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.: **సామరస్య నినాదాలు.. నేరగాళ్లపై చర్యల కోసం పట్టు:** ఉద్రిక్తతలు పెరుగుతున్న క్రమంలోనే, పట్టణంలోని పెద్దలు శాంతిని కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. పోలీస్ స్టేషన్ పరిసరాల్లో 'హిందూముస్లిం భాయ్ భాయ్' నినాదాలు చేస్తూ, నేరానికి మతపరమైన రంగు పూయవద్దని కోరుతున్నారు. అయితే, తప్పు చేసిన వ్యక్తిని ఏ వర్గానికి చెందినవాడైనా సరే చట్టం కఠినంగా శిక్షించాల్సిందేనని, అప్పుడే వైద్యులకు భరోసా ఉంటుందని ఐఎంఏ ప్రతినిధులు స్పష్టం చేశారు. జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి నిందితులను కఠినంగా శిక్షించకపోతే ఈ ఆందోళన మరింత ఉధృతమవుతుందని హెచ్చరించారు.

నిర్మల్ పట్టణంలో పోలీసులు భారీగా మోహరించారు. నిందితుల అరెస్ట్ విషయంలో స్పష్టమైన హామీ లభించే వరకు ధర్నా విరమించే ప్రసక్తే లేదని వైద్య సంఘాలు తేల్చి చెబుతున్నాయి.

# ప్రతిపాదనలు అందిస్తే ఆసుపత్రికి పరికరాలు



**ప్రజాపక్షం/గోదావరిఖని :** రామగుండం మండలం గోదావరిఖని జనరల్ ఆసుపత్రిని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఔట్ పేషెంట్ విభాగాలను, క్రిటికల్ కేర్ సెంటర్, ఎస్.ఎన్.సి.యు. ఎక్స్‌రే ఏరియా, అల్ట్రా సౌండ్, చిన్న పిల్లలు, ఫిజియోథెరపి విభాగాలను కలెక్టర్ పరిశీలించారు. రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు అవసరమైన పరికరాల కోసం ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. ఆస్పత్రిలో అదనంగా ఒక ఎక్స్‌రే మెషిన్, అల్ట్రాసౌండ్ ఏర్పాటు చేయాలన్నారు. ఫిజియోథెరపి నిర్వహణకు అవసరమైన సిబ్బంది నియామకం చేపట్టాలన్నారు. సదరం విభాగంలో చేసిన ఏర్పాట్ల పట్ల కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. వైద్యులు సకాలంలో విధులకు హాజరవుతూ రోగులకు మంచి సేవలు అందించాలన్నారు. అనంతరం ఎన్‌టిపిసి సీఎస్సార్ నిధులతో గోదావరిఖనిలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ షెడ్యూల్ కులాల బాలికల వసతి గృహాన్ని పరిశీలించారు. కలెక్టర్ వెంట డాక్టర్ అరుణ, డాక్టర్ కృపాబాయి, డాక్టర్ రాజు, నర్సింగ్, పలువురు అధికారులు ఉన్నారు.

# శ్రీరామ నవమి వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు

**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ తీగలగుట్టపల్లిలోని శ్రీ కోదండ రామాలయంలో శ్రీ రామ నవమి వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని రామయ్య, సీతమ్మ పెళ్లి వేడుకల కోసం అత్యంత సుందరంగా ముస్తాబు చేశారు. ప్రతీ యేటా ఎంతో ఘనంగా నిర్వహించే వేడుకలకు భక్తులు వేల సంఖ్యలో హాజరవుతుంటారు. నిర్వాహకులు అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ యేడాది సైతం అత్యంత వైభవోపేతంగా ఆలయాన్ని సుందరీకరించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయంలో పెద్ద ఎత్తున చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. ఎండాకాలం కావడంతో వేడుకలకు హాజరయ్యే భక్తులకు, చిన్నారులకు ఎలాంటి ఇబ్బంది పడకుండా ఉండేందుకు కూలర్లను ఏర్పాటు చేస్తున్నారు. వచ్చే ప్రతి ఒక్క భక్తుడి దాహార్తిని తీర్చేందుకు మంచి నీళ్లు, మజ్జిగను అందుబాటులో ఉంచారు. వేడుకలకు హాజరయ్యే భక్తులకు భోజన, ప్రసాదాలు సైతం అందజేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. దాదాపు10 నుంచి 20 వేల మంది భక్తులు నవమి వేడుకలకు హాజరవుతారని అంచనా వేస్తున్న ఆలయ నిర్వాహకులు అందరికీ సరిపడా భోజనాలు, ప్రసాదాలను సిద్ధం చేస్తున్నారు.



# దళిత సంక్షేమాన్ని విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

**ప్రజాపక్షం/కరీంనగర్ :** 2026–27 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర అసెంబ్లీలో ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన రూ. 3,24,254 కోట్ల బడ్జెట్‌లో దళిత సంక్షేమానికి తీవ్రమైన అన్యాయం జరిగిందని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ తీవ్రంగా విమర్శించారు. దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) కరీం నగర్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం బోయిని తిరుపతి అధ్యక్షతన స్థానిక బద్దం ఎల్లారెడ్డి భవన్ లో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి డిహెచ్‌పిఎస్ జాతీయ సమితి సభ్యుడు బోయిని అశోక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ గతంలో రూ. 40,000 కోట్లుగా ప్రకటించిన దళిత బడ్జెట్‌ను ప్రస్తుత బడ్జెట్‌లో కేవలం రూ. 11,784 కోట్లకు తగ్గించడం దళితులను మోసం చేయడమేనన్నారు. ప్రభుత్వం ఘనంగా ప్రకటించిన చేవెళ్ల ఎస్సీ,ఎస్టీ డిక్లరేషన్‌కు బడ్జెట్‌లో ఎలాంటి ప్రస్తావన లేకపోవడం ఆందోళనకరమన్నారు. 2026–27 సంవత్సరానికి ఎస్సీ సంక్షేమానికి కేవలం రూ. 11,784 కోట్లు మాత్రమే కేటాయించడం సరిపోదన్నారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద బాధితులకు చెల్లించాల్సిన ఎక్స్‌గ్రేషియా నిధులు బడ్జెట్ లేమితో వేలాది మందికి అందలేదని పేర్కొన్నారు. కులాంతర వివాహాల ప్రోత్సాహకాలు రెండు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. గత మూడు సంవత్సరాల బడ్జెట్ కేటాయింపులు, విడుదలలు, ఖర్చులపై ప్రభుత్వం వెంటనే శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. డిహెచ్‌పిఎస్ రాష్ట్ర రెండవ రాష్ట్ర మహాసభలు ఏప్రిల్ 17 18 తేదీల్లో వరంగల్ లో జరుగునని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు బత్తుల బాబు, రఘు, ఎల్లయ్య, నాంపల్లి తదితరులు పాల్గొన్నారు.

## కాలువకు గండి, సర్పంచి మరమ్మతులు

**ప్రజాపక్షం/అంతర్గాం :** పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం టిటిఎస్ అంతర్గాం గ్రామంలోని ఎస్ఆర్ఎస్‌పి ప్రధాన కాలువకు గండి పడి గత కొంత కాలంగా నీరు వృధాగా పారుతున్నది. అదేవిధంగా నీరు సమీప ఇండ్లలోకి చేరి నిలుస్తున్నది. దీంతో కాలువకు దిగువన పంట పొలాలకు నీరు పారక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని రైతులు తెలుపడంతో స్థానిక సర్పంచి అంబోతు రవికుమార్‌నాయక్ తన సొంత డబ్బుతో కాలువకు గండి పడినచోట సిమెంటుతో గురువారం మరమ్మతులు చేయించారు. పంట పొలాలకు కాలువ నీరు పారేలా చేసిన సర్పంచిని రైతులు, గ్రామ ప్రజలు అభినందిస్తున్నారు.

## వృద్ధురాలి ప్రాణాలు కాపాడిన 108 వైద్యులు

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం లక్కారం గ్రామానికి చెందిన డి. రాజేశ్వరి (77) ఏళ్ల వృద్ధురాలు అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న రాజేశ్వరి హఠాత్తుగా షుగర్ లెవెల్స్ తగ్గడంతో కుప్పకూలిపోయింది. వారి ఇంట్లో వాళ్లు 108 కి సమాచారం ఇవ్వగా హుటాహుటిన చేరుకున్న ముత్తారం ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణంలో ఉన్న 108 అంబులెన్స్ టెక్నీషియన్ అంకతి ప్రశాంత్, పైలెట్ కే. వెంకటేష్ సంఘటన స్థలానికి చేరుకొని వాళ్ళింట్లో వారిని ఆమెకు ముందుగా ఏమైనా జబ్బుందా తెలుసుకొని షుగర్ ప్రాబ్లెమ్ ఉందని చెప్పగా షుగర్ పరీక్ష చేసి షుగర్ లెవెల్స్ డౌన్ అయ్యా అని చెప్పి అంబులెన్స్ లోకి తరలించుకొని డి25 గ్లూకోస్ పెట్టుకొని వైద్యం చేసుకుంటూ గోదావరిఖని ప్రభుత్వ హాస్పటల్ కి తరలించారు. హాస్పిటల్ వెళ్లేలోపే అంబులెన్స్ లోనే స్పృహలోకి రావడం జరిగింది.108 వారి సేవలను అని గ్రామస్తులతో పాటు బాధితురాలు బంధువులు సభ్యులు అభినందించి కృతజ్ఞతలు తెలిపారు.

## వృద్ధుడి ఆత్మహత్య

**ప్రజాపక్షం /మల్లాపూర్ :** మండలంలోని చిట్టాపూర్ గ్రామానికి చెందిన బొమ్మెన నరసయ్య 75 సంవత్సరాల వృద్ధుడు అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై అనిల్ గురువారం తెలిపారు. మృతుడు గతంలో గ్రామపంచాయతీ సఫాయి కార్మికునిగా పనిచేసేవాడని, అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఇంటి వద్దనే ఉంటున్నాడని, ఈనెల 24వ తేదీన రాత్రివేళ ఇంటి నుండి వెళ్లి తిరిగి రాలేదని కుటుంబ సభ్యులు గాలించగా ఆచూకీ లభించలేదని, గురువారం రోజున వెతుకుతున్న క్రమంలో గ్రామ శివారులోని కాళీ స్థలంలో చెట్ల పొదల్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబీకులు గుర్తించారన్నారు. మృతికి గల కారణాలు అనారోగ్య సమస్యలే ప్రధాన కారణమని భార్య హన్మక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకునీ దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి కృషి



**ప్రజాపక్షం / హుజురాబాద్ :** సమాజంలో ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించడంలో ఎల్ఐసి ఏజెంట్ల పాత్ర కీలకమైందని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ వొడితెల ప్రణవ్ అన్నారు. గురువారం రోజున హుజురాబాద్ పట్టణంలో ఎల్ఐసి ఏజెంట్ల ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా ఆయన హజరయ్యారు. ఈ సందర్భంగా ఏజెంట్లు ఘన స్వాగతం పలికి, శాలువాతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఇంటితో కుటుంబంతో ఎల్ఐసి ఏజెంట్లకు మంచి సంబంధాలు కలిగి ఉంటాయని, వారికి మాజీ రాజ్యసభ సభ్యులు వొడితెల రాజేశ్వర్ రావు ఎల్ఐసి బిల్డింగ్ నిర్మాణం కొరకు స్థలం కేటాయించారని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బిల్డింగ్ నిర్మాణానికి నిధులు కేటాయిస్తున్నామని అన్నారు. ఏజెంట్లకు సంబంధించి ఏమైనా సమస్యలు తన దృష్టికి వస్తే వాటిని పరిష్కారం చేయడానికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుహాసిని, కౌన్సిలర్లు, ఎల్ఐసి ప్రతినిధులు, ఏజెంట్లు, కాంగ్రెస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మున్సిపల్ పాలకవర్గ అత్యవసర సమావేశం




**ప్రజాపక్షం/జమ్మికుంట:** జమ్మికుంట మున్సిపాలిటీ పాలకవర్గం అత్యవసర సమావేశం కమిషనర్ మహమ్మద్ అయాజ్ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మెన్ మొలుగు ప్రశాంత్ కుమార్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో ప్రవేశపెట్టిన వేసవి కాలంలో నీటి ఎద్దడిని పరిష్కరించేందుకు బోర్‌ల రిపేర్, వాటర్ ట్యాంక్ ల ఏర్పాటు, పారిశుధ్య, వాటర్ సప్లై, ఆఫీస్ సిబ్బంది 202627 ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాల చెల్లింపు, అన్ని పార్కలలో లైటింగ్ ఏర్పాటు , స్ట్రీట్ లైట్స్ కోనోగోలు , హమాలి సంంఘ కార్మికులకు టాయిలెట్ బ్లాక్ ఏర్పాటు చేయుట వంటి 32 అంశాలను పాలకవర్గం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సందర్భంగా కమిషనర్ మహమ్మద్ అయాజ్, చైర్మెన్ మొలుగు ప్రశాంత్ కుమార్ లు మాట్లాడుతూ జమ్మికుంట మున్సిపాలిటీ వార్డు కౌన్సిలర్లు తెలిపిన వార్డులలో ఉన్న సమస్యలను, పారిశుధ్య కార్మికులు వార్డుకు ఇద్దరు కాకుండా మూడు వార్డుల కార్మికులను ఒకే సారి గ్యాంగ్ వర్క్ కేటాయించి వార్డులలో ఉన్న సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తామన్నారు.ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ ముంతాజ్ అలీఎడి అహ్మద్, మున్సిపల్ మేనేజర్ జి రాజిరెడ్డి, జె.ఏ.ఓ. రాజశేఖర్ రెడ్డి, ఏఈ వికాస్, టీపీఓ శ్రీధర్, రాజ్ కుమార్, దీపిక, సీనియర్ అసిస్టెంట్ వాణి, ఆర్ఐ భాస్కర్ ఎస్ఐ మహేష్, మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు పలువురు పాల్గొన్నారు.

## ప్రజా వ్యతిరేక పనులను కాంగ్రెస్ ప్రభుత్వం చేయదు




**ప్రజాపక్షం/హుజురాబాద్:** ప్రజా వ్యతిరేక పనులను కాంగ్రెస్ రేవంత్ ప్రభుత్వం ఏ రోజు చేయబోదని హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ వొడితెల ప్రణవ్ అన్నారు. గత మూడు రోజులుగా డంపింగ్ యార్డు రద్దు కోసం అఖిల పక్షం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరసన దీక్షలకు సంఘీభావం తెలుపుతూ గురువారం రోజున హుజురాబాద్ పట్టణంలోని అంబేద్కర్ కూడలి వద్ద ఏర్పాటు చేసిన నిరసన దీక్షలో ఆయన పాల్గొన్నారు. కాసేపు వారితో కలిసి దీక్షస్థలిపై కూర్చున్నారు. ఈ సమస్యకు ప్రణవ్ వారధిగా ఉండి పరిష్కారం చూపెట్టాలని అఖిల పక్ష నాయకులు కోరారు. అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ ఇప్పటికే ప్రభుత్వ పెద్దలకు ఈ సమస్యపై వివరించామని, ప్రజలకు హానీ చేసే ఏ పనిని అయినా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఒప్పుకోదని, డంపింగ్ యార్డు వలన ప్రజలకు తలెత్తే సమస్యలను అధికారులకు వివరించామని, వివిధ కార్పోరేషన్, మున్సిపల్ నుండి వచ్చే చెత్త వలన చెడు పరిమాణాలు ఎదురవుతాయని అన్నారు. హుజురాబాద్ డంపింగ్ యార్డు వద్దని జనాలు నివాసం లేని చోట నిర్మించుకోవాలని సూచించామని తెలిపారు. దీని కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలుస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుహాసిని, కౌన్సిలర్లు, వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## జిల్లాస్థాయి స్పోర్ట్స్ స్కూల్ ఎంపిక పోటీలకు చొప్పదండి విదాత్యర్థులు



**ప్రజాపక్షం/చొప్పదండి:** రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ స్కూల్ అడ్మిషన్ల కోసం కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో జరగనున్న జిల్లా స్థాయి ఎంపిక పోటీలకు చొప్పదండి మండలం నుంచి విధ్యార్థులు ఎంపికయ్యారు. ఈ మేరకు మండల విద్యాధికారి పి.మోహన్ విధ్యార్థుల వివరాలను తెలిపారు. ఎండి.ఇమ్రాన్, ఎండి.అష్రఫ్, ఎ.మనీష్, కె.శివ ప్రణయ్ , వి.శ్రీనిధిలు మండల స్థాయి స్పోర్ట్స్ స్కూల్ ఎంపిక పోటీల్లో చక్కటి ప్రతిభ కనబరి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. జిల్లాస్థాయి స్పోర్ట్స్ స్కూల్ ఎంపిక పోటీలలో పాల్గొనే విధ్యార్థులు మండల సెక్రటరీ జడ్‌పిహెచ్ఎస్ బాయ్స్ చొప్పదండి ఫిజికల్ డైరెక్టర్ కె.కృష్ణను సంప్రదించాలని సూచించారు.

## జాతీయ అర్చరీ పోటీలకు ఎంపికైన అతర్వ్‌కు అభినందన

**ప్రజాపక్షం/చొప్పదండి:** కరీంనగర్ పట్టణ ప్రాంతానికి చెందిన కొండపాక అతర్వ్ జాతీయ ఆర్చరీ పోటీల్లో ఎంపికైన సంధర్భంగా ఉమ్మడి గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ శాలువా బొకేతో సన్మానం చేశారు. అనంతరం మాట్లాడుతూ సన్‌రైజ్ హాస్పిటల్ డాక్టర్ దివ్య, డాక్టర్ కొండపాక కిరణ్ కుమార్ గౌడ్‌ల కుమారుడు అతర్వ్ 10 సంవత్సరాల వయస్సులోపు రాష్ట్ర స్థాయి అర్చరీ(విలు విద్యలో) పాల్గొని జాతీయ అర్చరీ పోటీలకు ఎంపికయ్యారు. కొండపాక అతర్వ్ వైద్యుల కుటుంబంలో పుట్టి క్రీడల్లో రాణించడం చాలా గొప్ప విషయమని కొనియాడారు. జాతీయ స్థాయి అర్చరీ పోటీల్లో బంగారు పతకం సాధించాలని ఆకాంక్షించారు.

## శిశుమందిర్‌లో శ్రీసరస్వతి విద్యాపీఠం ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**ప్రజాపక్షం/కొత్తపల్లి:** శ్రీరాముని మహోన్నత గుణాలను స్మరించుకుంటూ ఆయన ఆదర్శాలను ఆచరణలో పెట్టే సంకల్పంతో శ్రీసరస్వతీ విద్యాపీఠం తెలంగాణ ఆవిర్బావ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ధర్మానికి ప్రతీకగా నిలిచిన శ్రీరాముడు సత్యం, కర్తవ్యనిష్ట, వినయం, పరస్పర గౌరవం వంటి విలువలను ప్రపంచానికి చూపించాడు, అదే విధంగా శ్రీ సరస్వతి విద్యాపీటం విద్యతో పాటు విలువలను భోదిస్తూ సమాజానికి ఆదర్శ పౌరులను తీర్చిదిద్దడంలో విశేష పాత్ర పోషిస్తోంది. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా శ్రీ సరస్వతి విద్యాపీటం పరిధిలో 176 పాఠశాలలు, 44 వేల మంది విధ్యార్థులు, 2600 మంది ఉపాధ్యాయులు, సిబ్బంది, 5 లక్షలకు పైగా పూర్వ విధ్యార్థులతో విశాలమైన విద్యా వృక్షంగా ఎదిగి దేశ అభివృద్ధికి తోడ్పడుతోందని వక్త ఎలగందుల సత్యనారాయణ ఉద్ఘాటించారు. కార్యక్రమంలో విధ్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రసంగాలు నిర్వహించి అందరినీ ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఇంజనీర్ కోల అన్నారెడ్డి, మేచినేని దేవేందర్‌రావు, తాటి రాజేశ్వర్‌రావు, కొత్తూరి ముకుందం, శ్రీరామోజు రవి, గట్టు రాంప్రసాద్, ఆచార్యులు, విధ్యార్థులున్నారు.

## రోడ్డుకు ఇరువైపులా చెట్ల తొలగింపు

**ప్రజాపక్షం/వీణవంక:** వీణవంక మండలం మల్లారెడ్డిపల్లి గ్రామంలో బస్సుల రాకపోకలకు రోడ్డుకు ఇరువైపులా అడ్డంగా ఉన్న చెట్లను గ్రామ సర్పంచ్ కొలిపాక రజిత శ్రీనివాస్ జెసిబి సాయంతో తొలగించారు. చల్లూరు నుంచి మల్లారెడ్డిపల్లె వరకు బస్సు రావడానికి రాత్రి సమయంలో ప్రయాణం చేసే ప్రయాణికులకు పెను ప్రమాదాలు చోటు చేసుకుంటున్నట్లు గమనించిన సర్పంచ్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ అర్సం శ్రీనివాస్ , మూడో వార్డు మెంబర్ కర్రె నాని యాదవ్, ఐదో వార్డు మెంబర్ తడిగొప్పుల భవాని కుమారస్వామి, ట్రాక్టర్ ప్రెసిడెంట్ నిమ్మల రాజయ్య, బండారి రవి, రాయనవేని తిరుపతి, చంద్రారెడ్డి, నిమ్మల కళ్యాణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన ఎన్జీవో నాయకులు



ప్రజాపక్షం/కరీంనగర్: తెలంగాణ ఎన్జీవోల సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షునిగా దారం శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కార్యదర్శిగా సంగెం లక్ష్మణరావు ఎన్నికైన అనంతరం, తొలిసారిగా జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సంఘ నాయకులను జిల్లా కలెక్టర్ అభినందించారు. రాబోయే రోజుల్లో సంఘ ప్రతిష్టను పెంచేందుకు కృషి చేస్తామని నాయకులు తెలిపారు. ఉద్యోగుల సమస్యలు, సంక్షేమం కోసం సంఘం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు. అదే విధంగా, ఉద్యోగులకు సంబంధించిన ఏవైనా సమస్యలు ఉన్నా వాటిని తన దృష్టికి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ సూచించారు. సమస్యలను పరిశీలించి తగిన విధంగా పరిష్కరించేందుకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి కిరణ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర నాయకుడు సర్దార్ హర్మీందర్ సింగ్, పట్టణ అధ్యక్షుడు మారుపాక రాజేష్ భరద్వాజ్, నాయకులు రమేష్ గౌడ్, ప్రసాద్ రెడ్డి, వెంకట్ రెడ్డి, ఇరుమల్ల శారద, సవిత, విజయలక్ష్మి, సుస్మిత, కరుణ, పవన్ కుమార్, అస్గర్ అలీ, కమలాకర్, కరుణాకర్, కయ్యం శ్రీనివాస్, లవకుమార్, తదితరులు పాల్గొన్నారు.

## వైద్య చికిత్సకు ఆర్థిక సాయం

ప్రజాపక్షం/ధర్మపురి : అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేద వ్యక్తి చికిత్స కోసం ధర్మపురి మున్సిపల్ కౌన్సిలర్ చీపిరిశెట్టి రాజేష్ అతని మిత్రులు ఆర్థిక సాయం అందించి అండగానిలిచారు.ధర్మపురి పట్టణంలోని బోయవాడలో నివాసముంటున్న రంగు వెంకటేష్ వడ్రంగి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటుండగా కొంతకాలంగా గుండె మూత్రపిండాలు దెబ్బతిని అనారోగ్యంతో మంచానపడ్డాడు.నిరుపేద కుటుంబానికి చెందిన వెంకటేష్ పరిస్థితి తెలుసుకున్న మున్సిపల్ 13వ వార్డు సభ్యులు చీపిరిశెట్టి రాజేష్ అతని మిత్రులు గడదాసు మనోజ్,చెట్టుపెల్లి సాగర్ లు కలిసి రూ.15 వేలు చికిత్స కోసం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ 7వ వార్డు కౌన్సిలర్ వాంకుడోత్ విజయ్ బాబు, బండి మహేష్, వాసు, సుమన్, గణేష్, కృష్ణ తదితరులు ఉన్నారు.

## మాదకద్రవ్యాలను నిర్మూలిద్దాం

ప్రజాపక్షం/ముత్తారం : యువత తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసే మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మత్తు రహిత సమాజ స్థాపనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మంథని ఎక్సైజ్ ఎస్సై సాయికుమార్ పిలుపునిచ్చారు. గురువారం పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలోని కాసర్లగడ్డ బస్టాండ్ ఆవరణంలో ప్రభుత్వ,జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మాదకద్రవ్యాల రహిత రాష్ట్రమే లక్ష్యంగా ఎక్సైజ్ శాఖ ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఎస్ఐ మాట్లాడుతూవిద్యార్థులు, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి, చదువుపై శ్రద్ధ వహించాలని,ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై సాయికుమార్ తో పాటు సిబ్బంది మహేందర్, నిరంజన్, రఘు తో పాటు రవి ఉన్నారు.

## ప్రభుత్వ ఉపాధ్యాయుడికి జాతీయ పురస్కారం

ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : విద్యారంగంలో రాణిస్తూనే పలు సామాజిక సేవా కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తున్న పెద్దపల్లి జిల్లా రామగుండం మండలంకు చెందినప్రభుత్వ ఉపాధ్యాయులు గూళ్ళ అంజన్ కుమార్ కు ప్రొఫెసర్ జయశంకర్ జీవన సాఫల్య జాతీయ పురస్కారాన్ని ప్రధానం చేసి ఘనంగా సన్మానించారు.వైద్యుల గ్లోబల్ ఫౌండేషన్ వసుంధర విజ్ఞాన వికాస మండలి 33వ వార్షికోత్సవ కార్యక్రమంలో తెలంగాణ భాషా శాశ్వత శాఖ తెలంగాణ సాహిత్య అకాడమీ సౌజన్యంతో హైదరాబాద్ రవీంద్రభారతిలో గురువారం ఈ అవార్డును ప్రధానం చేశారు. జాతీయ పురస్కారం అందుకున్న సందర్భంగా పలువురు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, శ్రేయోభిలాషులు అంజన్ కుమార్‌కు అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఎస్సి యువతీ యువకులు, వార్షిక ప్రణాళిక దరఖాస్తులు సమర్పించాలి

ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : ఏప్రిల్ 2 లోపు ఎస్సీ యువతీ యువకులు, వార్షిక ప్రణాళిక దరఖాస్తులు సమర్పించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగ ఎస్సీ యువతీ యువకులకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం పలు పథకాలను ఆమోదించిందని అన్నారు. 202526 వార్షిక ప్రణాళికకు సంబంధించి 90 శాతం సబ్సిడీ 10 శాతం బ్యాంకు లోన్ తో లక్ష రూపాయల విలువ గల 100 టూ వీలర్ ఎలక్ట్రిక్ వాహనాలు, 70 శాతం సబ్సిడీ, 30 శాతం బ్యాంకు లోన్ తో 3 లక్షల రూపాయలు విలువ గల 71 త్రీ వీలర్ ఎలక్ట్రిక్ వాహనాలు, 7 లక్షల రూపాయలు విలువ గల 15 సోలార్ యూనివర్సల్ పంపు కంట్రోల్ సెట్ లు, పశుసంవర్ధక పథకాలు, మిల్క్ అనిమల్, పట్టు పరిశ్రమ, సెరికల్చర్, ఉద్యనవన పథకాలు కూరగాయల పెంపకం పథకాలను పెద్దపల్లి జిల్లాకు ప్రభుత్వం కేటాయించిందని అన్నారు. వ్యవసాయేతర పథకాలకు 21 నుంచి 50 సంవత్సరాల వయసు, వ్యవసాయ పథకాలకు 21 నుంచి 60 సంవత్సరాల వయసు ఉండాలని, అభ్యర్థులు ఆధార్ కార్డు రేషన్ కార్డు కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధృవీకరణ పత్రం (గ్రామీణ ప్రాంతాలలో సంవత్సరానికి లక్ష 50 వేల రూపాయలు, పట్టణ ప్రాంతాల్లో 2 లక్షల) మించి ఉండకుండా ఉండాలని, శాశ్వత డ్రైవింగ్ లైసెన్స్ (రవాణా రంగ పథకాలకు) , పట్టాదారు పాసు పుస్తకం (సోలార్ పంప్ సెట్ కోసం కనీసం రెండు ఎకరాల భూమి ఉండాలని) దివ్యాంగ అభ్యర్థులు అయితే సదరం సర్టిఫికెట్, పాస్పోర్ట్ సైజ్ ఫోటోగ్రాఫ్ తో అభ్యర్థులు తమ దరఖాస్తును నమోదు చేయాలని అన్నారు. నిరుద్యోగ ఎస్సీ యువతీ యువకులు ఏప్రిల్ 2లోగా తమ దరఖాస్తులను ఆన్ లైన్ పోర్టల్ https://tgobmms.cgg.gov.in లో నమోదు చేయాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## అధ్వాన్నంగా వన్ ఇంక్లైన్ రోడ్డు



ప్రజాపక్షం/పెద్దపల్లి : వన్ ఇంక్లైన్ ఫిల్టర్ బెడ్ నుంచి రైల్వే అండర్ బ్రిడ్జి వరకు రోడ్డు పై పారుతున్న నీటిని అరికట్టేందుకు సింగరేణి యాజమాన్యం చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు తోడుపునూరి రమేష్ కుమార్ డిమాండ్ చేశారు.సింగరేణి ఆర్జీ వన్ ఏరియా లోని జిడికె వన్ ఇంక్లైన్ ఫిల్టర్ బెడ్ నుంచి రైల్వే అండర్ బ్రిడ్జి వరకు ఉన్న రోడ్డు పై నీటి లీకేజీ కారణంగా గత కొన్ని రోజులుగా రోడ్డు మీద బురద నీటి వల్ల రోడ్డు అంతా అధ్వాన్నంగా మారిందని, నీటి లీకేజీని అరికట్టేందుకు ఆర్జీ వన్ యాజమాన్యం చర్యలు తీసుకోవాలని అన్నారు గురువారం ఆయన వన్ ఇంక్లైన్ రోడ్డు పై నీటి లీకేజీ తో పారుతున్న నీటిని పరిశీలించి అనంతరం ఆయన మాట్లాడుతూ వన్ ఇంక్లైన్ రోడ్డు పై నిత్యం గోదావరిఖని కి వెళ్ళేందుకు జనగామ, సుందిల్ల, ముస్త్యాల ప్రజలు, వాహన దారులు తమ అవసరాల కోసం వెళ్తారని, అదేవిధంగా గోదావరిఖని లోని వివిధ కాలనీ లలో ఉంటున్న సింగరేణి ఉద్యోగులు ఈ రోడ్డు పై వివిధ గనులకు విధులకు హాజరు కావడం కోసం వెళ్తారని, ఇట్టి రోడ్డు పై గత కొన్ని రోజులుగా వన్ ఫిల్టర్ బెడ్ సమీపంలో 8వ కాలనీ కి సరఫరా చేసే పైపులైన్ నుంచి నీటి లీకేజీ తో రోడ్డు అంతా బురద మయంగా మారి అధ్వాన్నంగా తయారైందని ఆయన పేర్కొన్నారు. రోడ్డు అంతా బురద నీటి వల్ల వాహన దారులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఆర్జీ వన్ యాజమాన్యం స్పందించి నీటి లీకేజీ ని అరికట్టేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో గుండెబోయిన పృథ్వీ రాజ్ ,తదితరులు పాల్గొన్నారు.

## జనగణన కార్యక్రమాన్ని పకడ్బందిగా నిర్వహించాలి



ప్రజాపక్షం/పెద్దపల్లి : జనగణన కార్యక్రమాన్ని పకడ్బందిగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.గురువారం జనగణన 2027 కార్యక్రమ నిర్వహణలో భాగంగా తొలిదశలో నిర్వహించనున్న హౌస్ లిస్టింగ్ , హౌసింగ్ సెన్సెస్ నిర్వహణ పై సంబంధిత అధికారులకు సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. అనంతరమామాట్లాడుతూ జనగణన తొలి దశ లో నిర్వహించాల్సిన హౌస్ లిస్టింగ్ కార్యక్రమం నిబంధనలను ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గతంలో పలు మార్లు సామాజిక, ఆర్థిక సర్వే నిర్వహించామని, ఇందులో సమాచారం అందించడం ఐచ్చికమని,కానీ జనగణన కార్యక్రమంలో ప్రతి ఒక్కరు తప్పనిసరిగా సమాచారం ఇవ్వాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. జనగణన కార్యక్రమంలో సమాచారం ఇవ్వడానికి నిరాకరించినా, తప్పుడు సమాచారం అందించిన చట్టం ప్రకారం కేసు నమోదు చేసే అవకాశం ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్యుమరేటర్లకు జనగణన సంబంధించి అన్ని అంశాలలో పూర్తి అవగాహన ఉండాలని అన్నారు.జనగణన సంబంధించి అధికారులకు ఇచ్చిన మేటిరియల్ ఒకటి రెండు సార్లు చదవాలని అన్నారు.జనగణన సంబంధించి సాఫ్ట్ వేర్ పని తీరు గమనించాలని, ప్రతి ఒక్క అంశాన్ని అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని కింది స్థాయి సిబ్బందికి వదిలి పెట్టవద్దని అన్నారు. జనగణన కార్యక్రమం దేశ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రజల నివాస గృహాల వివరాలు, మౌలిక సదుపాయాల స్థితి, కుటుంబాల వివరాలు తదితర అంశాలను ఈ దశలో నమోదు చేయడం జరుగుతుందని వివరించారు. శిక్షణలో భాగంగా డేటా సేకరణ విధానం, డిజిటల్ పరికరాల వినియోగం, ఫీల్డ్ స్థాయిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. మే 11 నుంచి జనగణన కార్యక్రమం ప్రారంభమై అవకాశం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ శిక్షణ కార్యక్రమంలో సంబంధిత జిల్లా స్థాయి అధికారులు, మండల/ మున్సిపల్/ మున్సిపల్ కార్పోరేషన్ ఎంపీఎస్ ఓ లు మరియు టెక్నికల్ అసిస్టెంట్లు ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం : జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం గోధూరు గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను కలెక్టర్ బి. సత్యప్రసాద్ గురువారం పరిశీలించారు.ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి గడువులోపు పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రతి లబ్ధిదారికి ప్రభుత్వం రూ.5 లక్షలు అందిస్తున్నట్లు తెలిపారు. నిర్మాణ సామగ్రి ధరలు నియంత్రణలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్థిక సమస్యలుంటే రుణాల సదుపాయం వినియోగించుకోవాలని, బిల్లులు నేరుగా ఖాతాల్లో జమ అవుతాయని లబ్ధిదారులతో కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో, హౌసింగ్ అధికారులు, తహసిల్దార్, ఎంపీడీవో,తదితరులు పాల్గొన్నారు.

## కాలనీలో చెత్త సమస్యను పరిష్కరించండి!

ప్రజాపక్షం/గోదావరిఖని : రామగుండం నగరపాలక సంస్థ 54వ డివిజన్ మహావీర్ యూత్ సమీప సింగరేణి క్వార్టర్స్ వీధిలో పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించాలని గత నెల రోజులుగా కోరుతున్న ఏవరూ పట్టించుకోవడంలేదని దండే యశ్వంత్‌గౌడ్ తెలిపారు. డబ్బాలలో చెత్త సేకరించి చెత్త వాహనంలోనే చెత్త వేసేలా చర్యలు తీసుకోవాలని, ఈ విషయమై కాలనీవాసులకు అధికారులు, స్థానిక కార్పొరేటర్ అవగాహన కల్పించాలన్నారు. రహదారిపైనే చెత్త పారవేస్తుండటంతో దుర్గంధం వెదజల్లడంతోపాటు రాకపోకలకు ఇబ్బంది ఎదురౌతుందన్నారు.

## 31న జిల్లా స్థాయి క్రీడా పాఠశాల ఎంపిక పోటీలు

ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు, జిల్లా కలెక్టర్ అనుమతితో ఈ నెల 31వ తేదీన జిల్లా స్థాయి క్రీడా పాఠశాల ఎంపిక పోటీలు నిర్వహించ నున్నట్లు జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి ఎ. సురేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.మండల స్థాయిలో ప్రతిభ కనబరిచి ఎంపికైన క్రీడాకారులకు జిల్లా స్థాయి పోటీలకు అర్హులని, మార్చి 31న మంగళవారం ఉదయం 10:00 గంటలకు పెద్దపల్లి ప్రభుత్వ ఐటీఐ కళాశాల మైదానం లో జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తున్నామని,మండల స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు నిర్ణీత సమయానికి మైదానానికి చేరుకోవాలని, ఎంపిక పోటీలకు వచ్చే క్రీడాకారులు, ఆధార్ కార్డు, ప్రస్తుతం చదువుతున్న పాఠశాల నుండి పొందిన బోనఫైడ్ సర్టిఫికెట్, పుట్టిన తేదీ ధృవీకరణ పత్రం, 3వ తరగతి ప్రోగ్రెస్ రిపోర్ట్, ఐదు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు, తాజా కుల ధృవీకరణ పత్రం, ఒక సెట్ ఒరిజినల్ ,జిరాక్స్ పత్రాలతో హాజరు కావాలని, 4వ తరగతిలో ప్రవేశం కోరే విద్యార్థులు 01.09.2017 నుండి 31.08.2018 మధ్య జన్మించి ఉండాలి, 31.08.2026 నాటికి వయస్సు పరిగణనలోకి తీసుకోబడుతుందని జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఒకే సంస్థ... ఒకే రూల్ అమలు చేయాలి!

ప్రజాపక్షం/రామగుండం : తెలంగాణ రాష్ట్ర విద్యుత్తు సంస్థలో పనిచేస్తున్న 20 వేల మంది ఆర్టిజన్ కార్మికుల విద్యార్హతల ప్రాతిపదికన కన్వర్షన్ ఇప్పించాలని, ఏపిఎస్ఈబి సర్వీస్ రూల్స్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ టివిఏఈ జెఎసి రాష్ట్ర కమిటి పిలుపులో భాగంగా రామగుండం డివిజన్ కార్యాలయం ఎదుట గురువారం స్థానిక సెక్షన్ల ఆర్టిజన్ కార్మికులు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఒకే సంస్థలో ఒకే రూల్ అమలు చేయాలని, తమ డిమాండ్లు పరిష్కరించకుంటే వచ్చే నెల 8వ తేదీన నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు కార్మికులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ సీనియర్ నాయకులు వడ్డేపల్లి సురేష్, కొంకటి శ్రీనివాస్, ఆవుల మహేష్, దుర్గం విశ్వనాథ్, ప్రభాకర్, జి.కిరణ్, బోరె శ్రీనివాస్, పాల్గొన్నారు.

## పట్టణాభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలి

ప్రజాపక్షం/ధర్మపురి : ధర్మపురి పట్టణాభివృద్ధి లో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని మున్సిపల్ చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి రాజేష్ అన్నారు.పట్టణంలోని 1వ వార్డులో గురువారం ప్రజా సమస్యల పరిష్కారానికై ప్రత్యేక సందర్శన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా నాగలక్ష్మి, వైస్ చైర్మన్ ఐ.రామయ్య,శ్రీనివాసరావు తదితరులు వార్డులోని ప్రజల ద్వారా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారం కోసం ఇలాంటి వార్డు సందర్శనలు కొనసాగిస్తామని చెప్పారు.

# సీతారాముల కల్యాణానికి ముస్తాబైన ఆలయాలు

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** శ్రీరామనవమిని పురస్కరించుకుని జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని శ్రీ కళ్యాణ రామచంద్రస్వామి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబయింది.శ్రీరామనవమి సందర్భంగా గా శుక్రవారం నిర్వహించే సీతారాముల కళ్యాణ మహోత్సవానికి ఆలయాలనునిర్వాహకులు మామిడి తోరణాలు ,పూల దండలతో అలంకరించగా రాత్రి వేళలో విద్యుత్ దీపాలతో ఆలయాలు జిగేల్ మంటున్నాయి.శ్రీ సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాల వద్ద పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు .మండలంలోని సీతారాముల కల్యాణానికి ఆయా గ్రామాల్లోని ఆలయాలు ముస్తాబయ్యాయి .ఇస్రాజ్ పల్లి లో త్రికుటాలయం ,భీమ్రాజ్ పల్లిలో శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయం ,మల్లన్న పేటలో రామాలయం ,చిల్వాకోడూర్ లో ,రామలింగేశ్వర స్వామి ఆలయం ,లక్ష్మీపూర్ లో గట్టు ఆంజనేయస్వామి ఆలయంతో పాటు పలు హనుమాన్ ఆలయాలను ముస్తాబు చేశారు. ఈ వేడుకలను కన్నులారా చూసేందుకు గ్రామం ప్రజలే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వస్తారు.భక్తుల సౌకర్యార్థం కోసం చలువ పందిళ్లు మంచినీళ్ల వసతులు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.



## దూషించిన వ్యక్తి పై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు

**ప్రజాపక్షం/మల్యాల :** తనకు రావాల్సిన డబ్బుల గురించి అడిగిన వ్యక్తి పై దాడి చేసి,కులం పేరుతో దూషించిన వ్యక్తి పై ఎస్సీ ,ఎస్టీ కేసు నమోదు అయినట్లు ఎస్సై నరేష్ కుమార్ తెలిపారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల జిల్లా మల్యాల మండలం రాంపూర్ గ్రామానికీ చెందిన రెబ్బ నర్సయ్య అనే వ్యక్తి తనకు రావలసిన డబ్బుల గురించి ఆ గ్రామ సర్పంచ్ భర్త బద్దం తిరుపతి రెడ్డిని అడగగా కోపోద్రిక్తుడైన తిరుపతి ఒక్కసారిగా రెబ్బ నర్సయ్య పై దాడి చేసి,కులం పేరుతో దూషించాడని పిర్యాదు చేయగా తిరుపతి రెడ్డి పై ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు చేసి,దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

## ఆర్టిజన్, అన్‌మాడ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం జగిత్యాల జిల్లా మెట్‌పల్లి డివిజన్ కార్యాలయం ఎదుట ఆర్టిజన్,అన్‌మాడ్ మరియు పీస్‌రేట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, విద్యార్హతల ఆధారంగా ఆర్టిజన్ కార్మికులను కన్వర్షన్ చేయాలని, అన్‌మాడ్ కార్మికులను విద్యుత్ సంస్థల్లో విలీనం చేయాలని కోరారు. అదేవిధంగా ఆర్టిజన్ కార్మికులకు ఏపీఎస్ఈబీ నిబంధనలు అమలు చేయాలని, విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న పీస్‌రేట్ కార్మికులకు జి.ఓ నెంబర్ 11 ప్రకారం కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.మిగిలిన సుమారు 6 వేల మంది కార్మికులను ఆర్టిజన్లుగా గుర్తించి, వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోచైర్మన్ రాంబాబు, డివిజన్ చైర్మన్ కోటేశ్వర్, కోచైర్మన్ మహేష్, కన్వీనర్ గంగాధర్,రాజేందర్,లోకేష్, విష్ణువర్ధన్, సాగర్, పాల్గొన్నారు.

## ముగిసిన వార్డు సభ్యుల శిక్షణ

**ప్రజాపక్షం/పెగడపల్లి:** మండల పరిధిలోని గ్రామపంచాయతీ వార్డు సభ్యుల పాలన సామర్థ్యాన్ని పెంచేందుకు ప్రభుత్వం చేపట్టిన ఓరియెంటెడ్ శిక్షణ కార్యక్రమం మొదటి దశ 11 గ్రామాలకు గురువారం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా ఎంపీడీవో పి శశి కుమార్ రెడ్డి మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను వార్డు సభ్యులు తమ గ్రామాల్లో అమలుచేసి ఆదర్శంగా నిలవాలని సూచించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న వార్డు సభ్యులందరికీ ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్, జి.మహేష్, శౌరి, విద్యాసాగర్, వార్డు సభ్యులు మరియు అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీరామ కథ పారాయణం



**ప్రజాపక్షం/రాయికల్ :** రాయికల్ మండలం వీరాపూర్ గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద గల దుర్గామాత మండపంలో బుధవారం రాత్రి తెలుగు తేజం అవార్డు గ్రహీత కనికరపు వీరస్వామి ఆధ్వర్యంలో శ్రీరామ కథ పారాయణం అంగరంగ వైభవంగా నిర్వహించారు.ముందుగా గ్రామ సర్పంచ్ దిండిగాల గంగురామస్వామి గౌడ్ జ్యోతి ప్రజ్వలన చేసి శ్రీరామ కథ పారాయణాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన నట సామ్రాట్ అవార్డు గ్రహీత బొమ్మిడి నరేష్ పాల్గొని శ్రీరామ కథ పారాయణం చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీరామ కథ పారాయణం అత్యంత పుణ్యప్రదమైనదని,మనసు ప్రశాంతతను,ఆత్మవిశ్వాసాన్ని,ధర్మ మార్గంలో నడిపే శక్తిని ఇస్తుందని ప్రబోధించారు.రామాయణాన్ని పారాయణం చేయడం వల్ల కష్టాలు తొలగిపోయి కార్యసిద్ధి కలుగుతుందని, పాపాలు నశించి మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కారణజన్ముడు తులసీదాస్ జన్మవిధానాన్ని చక్కగా వివరించారు.జగిత్యాల, అల్లీపూర్,ఉప్పుమడుగు భజన మండలి ఆధ్వర్యంలో భక్త గాన కచేరి నిర్వహించగా గ్రామస్తులు వినితరించి తన్మయులయ్యారు. అనంతరం నిర్వాహకులు గ్రామపంచాయతీ పాలకవర్గాన్ని, నాయకులను శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దుంపల నర్సారెడ్డి,వార్డు సభ్యులు చెట్లపెల్లి అంజన్న,తోట్లె రాజరెడ్డి,దొమ్మటి లావణ్య,నాయకులు,గ్రామస్తులు,భజన మండలి సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల్లో రాణించాలి



**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ :** విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో రాణించాలని జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని రెడ్డి పంక్షన్ హాలులో గురువారం ఆల్ఫోర్స్ ఈటెక్నో పాఠశాల వార్షికోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిలుగా ఆల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ వాణిలు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో దోహదపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు తదితరులు ఉన్నారు.

## వైభవంగా ప్రారంభమైన సీతారాముల కల్యాణ మహోత్సవాలు



**ప్రజాపక్షం/పెగడపల్లి :** మండలంలోని నామాపూర్ గ్రామంలో వెలసిన శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవస్థాన 41వ వార్షిక కళ్యాణ మహోత్సవాలు గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు ఉదయం దేవాలయ ప్రాంగణంలో స్త్రీ మూర్తులచే కుంకుమార్చన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.గ్రామ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని, మంగళవాయిద్యాల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. స్వామివారి నామస్మరణతో నామాపూర్ గ్రామం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజైన శుక్రవారం నేడు మధ్యాహ్నం 12:22 గంటలకు అభిజిత్ లగ్నంలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని అత్యంత కనుల పండువగా నిర్వహించనున్నారు. ఈ వేడుకకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ చైర్మన్ గోపు వీరారెడ్డి, కమిటీ సభ్యులు కోరారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిర్ర రజిత రమణాకర్,మాజీ సర్పంచ్ ఇనుగండ్ల కరుణాకర్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ పెద్ది సంతోష్, మాజీ యంపిటిసి కొమురవెల్లి ఆనందం, ప్రసాద్,వెంకటరమణ,మనోహర్, సత్తయ్య,చందు,పులి లక్ష్మణ్ గౌడ్ ఆలయ పురోహితులు అనుపురం మురళి,ధీరజ్ హర్షిత్,తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి ర్యాంక్ సాధించిన విద్యార్థినికి సన్మానం



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కోజన్ కొత్తూరు గ్రామంలోని మండల పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముత్యాల మిధున జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష వ్రాసి ఈ సంవత్సరానికి జిల్లాలో 5వ ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా పాఠశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి కె. రాము ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థినిని అభినందించారు.మిధున విజయానికి కృషి చేసిన ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి, ఉపాధ్యాయులను ప్రత్యేకంగా ప్రశంసించారు.విద్యార్థులను ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రోత్సహిస్తే మరింత ఉన్నత స్థాయికి చేరుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బండారి మధు, ఉపాధ్యాయులు,ప్రజాప్రతినిధులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సైబర్ మోసాలకు గురైతే వెంటనే ఫిర్యాదు చేయాలి

**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ :** సైబర్ మోసాలకు గురైతే తక్షణమే 1930కి ఫిర్యాదు చేయాలని సైబర్ క్రైం డీఎస్పీ వెంకట రమణ పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ, గురుకుల కళాశాలలో విద్యార్థులకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాల నివారణపై అవగాహన సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఎస్పీ హాజరై మాట్లాడుతూ మహిళలు, విద్యార్థినిలు సోషల్ మీడియా వేదికల ద్వారా జరుగుతున్న వివిధ రకాల మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలు ఇటీవల కాలంలో ఎక్కువగా పెరుగుతున్నాయని ఘటనలు ఎదురైనపుడు ధైర్యంగా ఫిర్యాదు చేయాలని కోరారు. ఫేక్ సోషల్ మిడియా ప్రొఫైల్ ద్వారా మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సోషల్ మిడియా ద్వారా తెలియని వ్యక్తులతో వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దని సూచించారు. విదేశాల్లో ఉద్యోగం, గిఫ్ట్ పంపిస్తున్నామని చెప్పి డబ్బులు అడిగే మోసాలకు గురి కాకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. లింకులు పంపించి డేటా దొంగలించడం, ఓటీపీలు తీసుకోవడం వంటి సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల రూరల్ ఎస్సై ఉమా సాగర్, సైబర్ క్రైం ఎస్సైలు కృష్ణ, దినేష్, కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ తదితరులు ఉన్నారు.

## తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ బిఎస్ లత

**ప్రజాపక్షం/కథలాపూర్ :** జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత కథలాపూర్ తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో నిర్వహణ విధానం,రికార్డుల సంరక్షణపై సమీక్ష నిర్వహించారు.ప్రత్యేకంగా పెండింగ్‌లో ఉన్న అంశాలపై అధికారులతో సమీక్షిస్తూ, మ్యాపింగ్ పనుల పురోగతి, భూసేకరణ సంబంధించిన వ్యవహారాలు, భూ భారతీ పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల అప్డేట్ పై వివరాలు తెలుసుకున్నారు.పెండింగ్‌లో ఉన్న అన్ని భూ సంబంధిత సమస్యలను వేగవంతంగా పరిష్కరించి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అలాగే భూ రికార్డుల నిర్వహణ పారదర్శకంగా, సమర్థవంతంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి, తహసీల్దార్ గుగ్గిళ్ల రమేష్ మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ సేవలను విస్తరింప చేస్తాం

**ప్రజాపక్షం /మల్లాపూర్ :** శ్రీ కనక సోమేశ్వర లయన్స్ క్లబ్ సేవలను మండల వ్యాప్తంగా విస్తరింప చేస్తామని క్లబ్ అధ్యక్షుడు రేవెల్లి తిరుపతి అన్నారు. ఇటీవలే ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరంలో ఆపరేషన్ అవసరమైన వ్యక్తులను రేకుర్తి కంటి ఆసుపత్రికి తరలించి ఉచితంగా కంటి ఆపరేషన్ నిర్వహించారు.ఆపరేషన్ అనంతరం బాధితులను ప్రత్యేక వాహనంలో స్వగృహాలకు చేర్చగా బాధితులు ఆనందాన్ని వ్యక్తం చేసి లయన్స్ క్లబ్ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ క్లబ్ అధ్యక్షుడు రేవెల్లి తిరుపతి, సభ్యులు సామల్ల విష్ణు,తదితరులున్నారు.

## సామ్రాట్ అశోక చక్రవర్తి జయంతి



**ప్రజాపక్షం/ఆదిలాబాద్‌రూరల్ :** ఆదిలాబాద్ కైలాష్ నగర్‌లోని అశోక బుద్ధ విహార్‌లో భారతీయ బౌద్ధ మహాసభ ఆధ్వర్యంలో సామ్రాట్ అశోక చక్రవర్తి 2330వ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బౌద్ధ భిక్షువు ఆర్య సంఘమిత్ర బుద్ధ వందనం సమర్పించగా, ప్రతినిధులు అశోక చక్రవర్తి, అంబేద్కర్ చిత్రపటాలకు నివాళులర్పించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నాజాడే ప్రజ్ఞా కుమార్, జిల్లా అధ్యక్షుడు విట్టల్ భూక్టే మాట్లాడుతూ.. కళింగ యుద్ధం తర్వాత అశోకుడు శాంతి మార్గాన్ని ఎంచుకుని బౌద్ధ ధమ్మాన్ని ప్రపంచ వ్యాప్తంగా విస్తరించారని కొనియాడారు. చరిత్రలో నిలిచిపోయేలా 84 వేల స్తూపాలను నిర్మించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భీమ్ రావు వాగ్మారే, దయానంద్, కాంతారావు, అమ్రపాల తదితరులు పాల్గొన్నారు.

## వివేకానంద స్కూల్ ప్రభంజనం

**ప్రజాపక్షం/తానూర్ :** తెలంగాణ గురుకుల ఫలితాల్లో మండల కేంద్ర వివేకానంద పాఠశాల విద్యార్థులు (2026–27)విద్యా సంవత్సరానికి ఐదవ తరగతిలో ప్రవేశ పరీక్ష ఫలితాలలో ఫస్ట్ ఫేస్ లో 14 మంది విద్యార్థులు సీట్లును సాధించిన సందర్భంగా గురువారం,వీరికి పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు, విశాంత్ కరెస్పాండెంట్ రాజు, నర్సింగ్, పాఠశాల ఉపాధ్యాయుల బృందం, అభినందించారు.

## అసెంబ్లీలో ఇప్ప సారా చిచ్చు

**ప్రజాపక్షం/ఆర్మూర్ :** ఇటీవలే తెలంగాణ అసెంబ్లీలో ఆర్మూర్ ఎమ్మెల్యేపై పైడి రాకేష్ రెడ్డి దేశ తొలి మాజీ ప్రధాని ఇందిరాగాంధీని అసెంబ్లీ సాక్షిగా అవమానపరుస్తూ వ్యాఖ్యలు చేయటం తీవ్రంగా ఖండిస్తున్నామని ఆర్మూర్ మాజీ ఎంపీపీ డీసీసీ ప్రధాన కార్యదర్శి పస్క నర్సయ్య ఓ ప్రకటన విడుదల చేశారు. దేశ సమైక్యత కోసం ప్రాణత్యాగం చేసిన నాయకురాలు దేశ రాజకీయ చరిత్రలో కీలకపాత్ర పోషించిన ఇందిరాగాంధీని నిండు సభలో అవమానించటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని తెలంగాణ అసెంబ్లీ వంటి గౌరవనీయ వేదికలో ఇటువంటి వ్యాఖ్యలు చేయటం ప్రజల భావాలను దెబ్బ తీయటమే కాకుండా రాజకీయ సంస్కృతిని దిగజార్చే చర్యనని ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి తన వైఖరిని మార్చుకోవాలని లేకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవల్సి వస్తుందని ఆర్మూర్ ప్రజలు ప్రజాస్వామ్య విలువలను గౌరవించే ప్రతిఒక్కరూ స్పందించాలన్నారు. రాజకీయ విలువలను కాపాడాలని ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని ప్రజలకు కాంగ్రెస్ నాయకులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు.

## కొత్తపేట పాఠశాలలో శ్రీరామ నవమి వేడుకలు



**ప్రజాపక్షం / జన్నారం :** జన్నారం మండలంలోని కొత్తపేట ప్రభుత్వ పాఠశాలలో శ్రీరామ నవమి వేడుకలు గురువారం కన్నుల పండుగగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు బిక్కు మాట్లాడుతూ విద్యార్థులకు చిన్నతనం నుంచే సంస్కృతి సాంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పండుగను పురస్కరించుకుని విద్యార్థులు సీతారాముల వేషధారణలో మెరిసిపోయి అందరినీ ఆకట్టుకున్నారు. చిన్నారులు చిన్ని రామయ్యగా సీతమ్మ తల్లిగా అలంకరించుకుని చేసిన ప్రదర్శనలు సందర్శకులను మంత్రముగ్ధులను చేశాయి. ఉపాధ్యాయురాలు సౌందర్య ఆధ్వర్యంలో విద్యార్థులకు రామాయణ ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం వేషధారణలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఉపాధ్యాయ బృందం అభినందించింది. పాఠశాల ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## శ్రీరామ నవమి శోభాయాత్ర బందోబస్తు ఏర్పాట్లపై సమీక్ష




**ప్రజాపక్షం/బైంసా :** శ్రీరామ నవమి సందర్భంగా నిర్వహించనున్న శోభాయాత్రల నేపథ్యంలో బైంసా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల,బైంసా సబ్‌డివిజన్ పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా బైంసాలో శ్రీరామ నవమి శోభాయాత్ర సాఫీగా,శాంతియుతంగా జరిగేలా అన్ని అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని,శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.సున్నితమైన ప్రాంతాల్లో ప్రత్యేక పహారా ఏర్పాటు చేసి,ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా డ్రోన్ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ నిర్వహిస్తూ,అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచాలని తెలిపారు.శోభాయాత్ర మార్గాలలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించి,ప్రజలకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల,ఐపీఎస్‌తో పాటు,బైంసా సబ్ డివిజన్ ఇన్స్పెక్టర్లు,ప్రవీణ్ కుమా ర్,ర వీందర్, సాయి కుమార్, ఎస్ఐలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రోగి ఎముకను కత్తిరించకుండా కీ హోల్ సర్జరీ




**ప్రజాపక్షం/నిజామాబాద్ :** రోగి ఎముకను కత్తిరించకుండా విజయవంతంగా కీ హోల్ సర్జరీ చేయడం జరిగిందని యశోధ హాస్పిటల్ డాక్టర్ విశాల్ ఖాంటే తెలిపారు. గురువారం నగరంలోని యశోధ మెడికల్ సెంటర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నిజామాబాద్‌కు చెందిన అనీస్ ఫాతిమా (80) సుమారు రెండు మూడు సంవత్సరాల నుండి శ్వాస ఆడకపోవటం వంటి సమస్యతలో ఆస్పత్రికి రావటం జరిగిందన్నారు. ఆమెకు తీవ్రమైన అయోర్టిక్ స్టెనోసిస (బృహద్ధమని కవాటంలో అడ్డు పడటం) ఉన్నట్లు నిర్ధారణ అయిందని వివరించారు. చాలా హాస్పిటళ్లలో వైద్యం కోసం తిరిగిన లాభం లేకుండా పోయిందని, ఓపెన్ హార్ట్ సర్జరీ అంటే భయంతో ఆమె శస్త్రచికిత్స చేయించుకోవడానికి భయపడుతున్నట్లు తెలిపిందని ఆమెకు సికింద్రాబాద్‌లోని యశోధ ఆస్పత్రిలో మినిమల్లీ ఇన్వాసివ్ కార్డియాక్ సర్జరీ(ఎఐంసిఎస్/కీ హోల్ హార్ట్ సర్జరీ) చేయమని డాక్టర్ విశాల్ ఖాంటే, డాక్టర్ ఎండి. వహాజ్‌అలీ సలహా ఇచ్చామన్నారు. రోగి ఎముకను కత్తిరించకుండా కీ హోల్ హార్ట్ సర్జరీ చేయించుకున్నారని రికవరీ వేగంగా ఉండే కొత్త టెక్నాలజీని ఉపయోగించి శస్త్రచికిత్స చేస్తామన్నారు. 4 రోజుల తర్వాత ఆమెను డిశ్చార్జి చేశామన్నారు. ప్రస్తుతం శస్త్రచికిత్స జరిగిన ఒక నెల తర్వాత, ఆమెకు ఆపరేషన్ జరిగిన స్థానంలో ఎలాంటి సమస్యలు లేవని, కొంచెం నొప్పి మినహా ఎటువంటి ఇబ్బందికర లక్షణాలు లేవన్నారు. ఆమె రోజువారీ కార్యకలాపాలను ప్రస్తుతం చేసుకుంటుందన్నారు. అనీస్‌ఫాతిమా మాట్లాడుతూ చికిత్స తర్వాత ఎలాంటి ఇబ్బందులు లేవని, త్వరగా కోలుకున్నానన్నారు. డాక్టర్లు కొత్త టెక్నాలజీని ఉపయోగించి శస్త్రచికిత్స చేయటంతో ఇప్పుడు సంతోషంగా ఉన్నానన్నారు. ఓపెన్ హార్ట్ సర్జరీ అంటే భయపడే నాకు యశోధ హాస్పిటల్ డాక్టర్లుకి హోల్ హార్ట్ సర్జరీ ద్వారా నా ప్రాణాలు కాపాడాలన్నారు. ఈ సందర్భంగా డాక్టర్లకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నారు. కార్యక్రమంలో అనీస్ పాతిమా కుటుంబ సభ్యులు, యశోధ హాస్పిటల్ మేనేజర్ శ్రీరాం సురేష్ పాల్గొన్నారు.

## దళితుల అభివృద్ధికి ప్రభుత్వం పాటుపడాలి




**ప్రజాపక్షం / బెల్లంపల్లి :** దళితుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించి తక్షణమే నిధులు విడుదల చేయాలని దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) నిర్మాణ బాధ్యులు దాగం మల్లేష్, జిల్లా కార్యదర్శి దేవి పోచన్న డిమాండ్ చేశారు. గురువారం బెల్లంపల్లి సిపిఐ కార్యాలయంలో డిఆర్ శ్రీధర్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కౌన్సిల్ విస్తృత సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి ఏళ్లు గడుస్తున్నా దళితుల బతుకులు మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్‌సి సబ్ ప్లాన్ నిధులను ప్రభుత్వం దారి మళ్లించకుండా దళితుల సంక్షేమానికి వినియోగించాలని కోరారు. అంబేద్కర్ అభయహస్తం కింద ప్రకటించిన రూ. 12 లక్షలు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో విఫలమవుతున్నాయని విమర్శించారు. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని, బ్యాక్ లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. మందమర్రిలో జరగనున్న జిల్లా మహాసభలతో పాటు వరంగల్‌లో ఏప్రిల్ 17, 18 తేదీలలో నిర్వహించే రాష్ట్ర రెండో మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి, మారుపెల్లి రవి, మామిడి గోపి, కామెర దుర్గయ్య, బండారి శంకర్, దేవికిరణ్, రెడ్డి సారయ్య, కట్ల పోచాలు పాల్గొన్నారు.

## న్యాయవాదుల గుమస్తాల సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక



**ప్రజాపక్షం/ ఆదిలాబాద్ రూరల్ :** ఆదిలాబాద్ న్యాయవాదుల గుమస్తా అసోసియేషన్ భవనంలో గురువారం నిర్వహించిన సమావేశంలో సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా నోముల గణేష్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మామిడాల దశరథ్‌లు ఎన్నికయ్యారు. కార్యవర్గంలోని ఇతర సభ్యులుగా ఉపాధ్యక్షుడు గన్నోజివార్ కిషన్, కోశాధికారి తెడ్డోజి రాకేష్, సంయుక్త కార్యదర్శి మోత్కుల ఆకాష్ యాదవ్, క్రీడా కార్యదర్శిగా గేనే అనిల్ యాదవ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను న్యాయవాదులు, తోటి గుమస్తాలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ...గుమస్తాల సంక్షేమానికి ఎల్లప్పుడూ తోడుగా ఉంటామని, వారి అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తామని తెలిపారు.

## బైంసా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొత్త కోర్సులు ప్రారంభం




**ప్రజాపక్షం/బైంసా :** బైంసా లోని గోపాల్ రావు పాటిల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచి నూతన కోర్సులు ప్రారంభించబడినట్లు కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు.బి.కామ్ లో బ్యాంకింగ్,ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇన్సూరెన్స్(బి.ఎఫ్.ఎస్.ఐ) అదే విధంగా,బీస్సీ కోర్సులో డైరీ పౌల్ట్రీ సైన్స్ విభాగంలో అప్రెంటిస్‌షిపవ ఎంబెడెడ్ డిగ్రీ ప్రోగ్రామ్ (ఏఈడిపి) ప్రారంభించడం విశేషం.ఈ కోర్సు 3 సంవత్సరాలపాటు కొనసాగుతూ,యూజీసీ ఎన్ఇపి2020 మార్గదర్శకాలకు అనుగుణంగా ఉంటుంది.ఇందులో 2 సంవత్సరాల తరగతి వేతనంతో కూడిన ఉద్యోగ శిక్షణ(ఓజెటీ) ఇవ్వబడుతుంది.ఈ విధానం విద్యార్థులలో నైపుణ్యాలను పెంపొందించి,ఉద్యోగ అవకాశాలను మెరుగుపరచడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన కీలక కోర్సులు అని ఈ కోర్సులో ప్రవేశం పొందాలని ప్రిన్సిపాల్ కర్రోళ్ల బుచ్చయ్య తెలిపారు.

## హోమ్ నిర్వహణ రిజిస్టర్ల పరిశీలన



**ప్రజాపక్షం/బోధన్ :** శక్తి సదన్ స్వదార్ హోమ్‌ను గురువారం బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో పరిశీలించారు. అనంతరం ఆయన హోమ్ యొక్క సమగ్ర నిర్వహణ, పరిపాలనను సమీక్షించారు. నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం పనులు జరుగుతున్నాయా..? అని నిర్ధారించారు. ఇన్‌మేట్స్‌కు అందిస్తున్న భోజన మెనూ ను పరిశీలించి, ఆహార నాణ్యత, పోషక విలువలను అంచనా వేశారు. అదేవిధంగా నివాసితులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సంక్షేమం, నివాస పరిస్థితులు, సమస్యలను తెలుసుకున్నారు. హోమ్ నుంచి వెళ్లే ఇన్‌మెట్స్ యొక్క సంప్రదింపు వివరాలను సేకరించి, తరువాత వారితో సంప్రదించి వారి అభిప్రాయాలు, సమస్యలను తెలుసుకోవాలని సూపరింటెండెంట్‌కు సూచించారు.

## ఐదు రోజులు దంచి కొట్టనున్న ఎండలు..

**ప్రజాపక్షం/ఎడపలి:**ఎడపల్లి మండలంలో గత వారం రోజులుగా ఎండలు రోజురోజుకు పెరుగుతూ అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ క్రమంలో ఎడపల్లి మండలంలో గురువారం నమోదైన 38డిగ్రీల ఉష్ణోగ్రతలతో జనాలు సతమతమయ్యారు. మరో ఐదు రోజులు ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలుపుతోంది. ఈ మేరకు శనివారం, ఆదివారం, సోమవారం లలో 40డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

## రోడ్డు నియమాలు పాటించి.. సురక్షితంగా గమ్యాన్ని చేరండి



**ప్రజాపక్షం/ఎడపలి:**ప్రయాణీకులు రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్త వహించాలని బోధన్ ట్రాఫిక్ ఎస్సై మహేష్ సూచించారు. రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం మండల కేంద్రంలోని మంగళ్పాహాడ్ చౌరస్తాలో బోధన్నిజామాబాద్ ప్రధాన రహదారిపై ఆరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మహేష్ ప్రయాణీకులకు రోడ్డు భద్రతపై సూచనలు చేశారు. ప్రతి వాహనదారుడు హెల్మెట్ ధరించాలని, ఇది కేవలం జరిమానాల నుంచి తప్పించుకోవడానికే కాకుండా, ప్రాణ రక్షణ కోసం అని గుర్తించుకోవాలని కోరారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి విలువైన ప్రాణాలను ప్రమాదంలో పడేసుకోవద్దని ఆయన హితవు పలికారు. ట్రాఫిక్ సిగ్నల్స్, ట్రాఫిక్ రూల్స్ ఖచ్చితంగా పాటించాలని, సురక్షిత ప్రయాణం కోసం అతివేగం కంటే సురక్షితమైన వేగంతో ప్రయాణించి గమ్యాన్ని చేరాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కందగట్ల రాంచందర్, వార్డు సభ్యులు, ఎఎస్సై ఇలియాస్ అలీ, పోలీస్ సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

## శ్రీరామనవమి పండుగ నేపథ్యంలో వైన్స్ బంద్

**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :**శ్రీరామనవమి పండగ నేపథ్యంలో శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకుని వైన్స్ షాపులను నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలోని ఆర్మూర్, బోధన్ నిజామాబాద్ డివిజన్ల పరిధిలో సెక్షన్ 20 (1) తెలంగాణ ఎక్సైజ్ యాక్టు 1968 ప్రకారం జిల్లా వ్యాప్తంగా శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని ముందస్తు చర్యలలో భాగంగా జిల్లాలో గల కల్లు దుకాణాలు, కల్లు డిపోలు, ఐఎంఎల్ (ఎ4) షాప్స్, 2 బి బార్స్ / టిడి 1, సిఎస్ 2 మొదలగునవి 27వ తేదీ ఉదయం 6 గంటల నుండి 28వ తేదీ ఉదయం 6 గంటల వరకు మూసి వేయబడుతాయని నిజామాబాద్ పోలీసు కమిషనర్ పి. సాయి చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు.

## అపోహలు, వదంతులు నమ్మవద్దు




**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :**వాట్సాప్, సోషల్ మీడియాలో వచ్చే వదంతులు నమ్మవద్దని దేశంలోను, రాష్ట్రంలోను, జిల్లాలోను వినియోగదారులకు సరిపడు పెట్రోల్, డీజిల్ నిలువలు ఉన్నాయి నిజామాబాద్ జిల్లా పెట్రోల్ బంక్ ఓనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు దినేష్ రెడ్డి అన్నారు. గురువారం ప్రెస్క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పూర్వ నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 385 పెట్రోల్బంకులు ఉండగా ఇందులో డెడ్ స్టాక్ నిబంధన మేరకు అన్ని బంకులలో ప్రస్తుతం 2500 లీటర్ల డీజిల్ పెట్రోల్ను కలిగి ఉన్నామని అన్నారు. . ఈ ప్రాంత రాజకీయ నాయకులు, అధికారులు, ప్రజలు నాడు పట్టించుకోకపోవడం కారణంగా స్టాక్ పాయింట్ ఎత్తేయడం జరిగిందని, నేడు చర్లపల్లి, మల్కాపూర్ వంటి స్టాక్ పాయింట్ల నుండి డీజిల్ పెట్రోల్ జిల్లాకు చేరుటకు సుమారు 16 గంటల రవాణా వాహనాలకు సమయం పట్టడం వల్ల ఇలాంటి కొరత ఏర్పడిందన్నారు. ప్రస్తుత తరుణంలో ప్రభుత్వ ఆయిల్ కంపెనీ చైర్మన్లు, ఉన్నతాధికారులు తమ రేటింగ్ నవరత్న తదితర వాటి కొరకు చూసుకుంటున్నారు కానీ, పెట్రోల్ బంక్ యాజమాన్యాల ఇబ్బందులను పరిగణలో తీసుకోకుండా అనవసరమైన నిబంధనలను తమపై రుద్దుతు పెట్రోల్ బంక్ యాజమాన్యాలను కట్టుబానిసలుగా చూస్తున్నారని అన్నారు. ప్రజలు మరీ ముఖ్యంగా వదంతులు నమ్మకండి అవసరం మేరకు పెట్రోల్, డీజిల్ వాడకానికి వినియోగించండి అని తెలిపారు.

## పన్నుల వసూళ్లతోనే పట్టణాభివృద్ధి



**ప్రజాపక్షం/ నిర్మల్ :** బైంసాపన్నుల వసూళ్ల ద్వారానే పట్టణాభివృద్ధి చేపట్టడం సాధ్యమవుతుందని బైంసా మున్సిపల్ కమిషనర్ వై.నవీన్ పేర్కొన్నారు.గురువారం మున్సిపల్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు.వార్షిక సంవత్సరం ముగింపు దశకు చేరుకుంటున్న నేపథ్యంలో పన్నులు చెల్లించి పట్టాణాభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.బైంసా పట్టణ పరిధిలో వార్షిక సంవత్సరం ముగింపు దశకు చేరుకుంటున్న నేపథ్యంలో పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.బైంసా పట్టణ పరిధిలో వార్షిక పన్నుల వసూళ్ల లక్ష్యం రూ.5.6 కోట్లు ఉండగా ఇప్పటి వరకు రూ.1.95 కోట్లు వసూలు చేసామని పేర్కొన్నారు.మిగతా పన్నుల వసూళ్ల కోసం గాను స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని వెల్లడించారు.15వ ఆర్థిక సంఘం నిధులు పొందేందుకు గాను మరో రూ.70 లక్షల పన్నులు వసూలు చేయాల్సి ఉందని తెలిపారు.ఇదే క్రమంలో పట్టణ పరిధిలో పన్నుల చెల్లించని వారిలో 161 మందిని టాప్ డిఫాల్టర్లుగా గుర్తించామని,సంబంధిత డిఫాల్టర్కు నోటీసులు జారీ చేసామని పేర్కొన్నారు.ఈ నెల ఖారులోగా పన్నులు చెల్లించని పక్షంలో డిఫాల్టర్లకు మున్సిపల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని వివరించారు..చెల్లించిన పన్నుల ద్వారానే పట్టణాభివృద్ధికి,మౌళిక వసతుల కల్పనకు వీలుంటుందని తెలిపారు.సమస్యలు పరిష్కరించేందుకు అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు.పన్నులు చెల్లించని వారందరూ ఈ నెలాఖరులోగా పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి బాధ్యతాయుత భాగస్వామ్యాన్ని అందించాలని కోరారు.

## ఫీజు రీయింబర్స్మెంట్ను వెంటనే విడుదల చేయాలి

**ప్రజాపక్షం/బోధన్:**పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని పిడిఎస్యు జిల్లా అధ్యక్షులు ఆర్.గౌతమ్ కుమార్ డిమాండ్ చేశారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం బోధన్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం బోధన్లో ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల బంద్ను నిర్వహించారు. అనంతరం గౌతమ్ కుమార్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం 202627 వార్షిక సంవత్సర బడ్జెట్ ప్రవేశ పెట్టిన విషయం మనందరికీ తెలిసిందేనని, దీనిలో విద్యా రంగానికి చాలా తక్కువ శాతం నిధులు కేటాయించడం జరిగిందన్నారు. విద్యార్థి సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు, ప్రజాస్వామిక వాదులు బడ్జెట్లో విద్యకు కనీసం 20శాతం నిధులు అయిన కేటాయించాలని తమ అభిప్రాయాలు తెలియచేసినప్పటికీ వాటిని పరిగణలోకి తీసుకోకుండా 8శాతం నిధులు మాత్రమే కేటాయించడం విద్యా రంగాన్ని పూర్తిగా గాలికి వదిలేయడమేనన్నారు. కనీసం ప్రభుత్వాలు రియంబర్స్మెంట్ విడుదల చేయకపోవడం సరైనది కాదని విద్యార్థుల సమస్యను గుర్తించి పెండింగ్ ఫీజు రియంబర్స్మెంట్, బెస్ట్ అవైలబుల్ స్కీమ్స్ బకాయిలను విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ రాష్ట్ర నాయకులు ఎన్.కార్తిక్, జిల్లా కోశాధికారి కె.సాయినాథ్, బలరాం, వికాస్, చక్రధర్, రవి తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు 3.5కోట్లు మంజూరు

**ప్రజాపక్షం/ఎడపలి:**మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా బోధన్ నియోజకవర్గంకు రూ. 3.5కోట్లు మంజూరయ్యాయి. ఈ మేరకు బోధన్, ఎడపల్లి, రెంజల్, నవీపేట్, సాలూర మండలంలో రోడ్లు, డ్రైనేజీలు, కాల్వలపై బ్రిడ్జిలు వంటి అభివృద్ధి పనులకు బోధన్ ఎమ్మెల్యే చొరవతో నిధులు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా ఆయా గ్రామాలకు సంబంధించి పనులను ప్రారంభించేందుకు కలెక్టర్ ఇలా త్రిపాఠి సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఎడపల్లి మండలంలోని జాన్కంపేట్ గ్రామంలో రథం చెరువు వద్ద స్మశాన వాటికకు వెళ్లే దారిలో ఇరుకుగా ఉన్న డి 50కెనాల్ పై బ్రిడ్జి వెడల్పు పనులకు రూ. 18లక్షలు మంజూరయ్యాయి. దశాబ్దాల కాలంగా ఉన్న ఈ సమస్యకు ఎడపల్లి మండలంలోని జాన్కంపేట్ గ్రామంలో రథం చెరువు వద్ద స్మశాన వాటికకు వెళ్లే దారిలో ఇరుకుగా ఉన్న డి 50కెనాల్ పై బ్రిడ్జి వెడల్పు పనులకు రూ. 18లక్షలు మంజూరయ్యాయి. దశాబ్దాల కాలంగా ఉన్న ఈ సమస్యకు ఎమ్మెల్యే నిధులు మంజూరు చేయడంతో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు కిషోర్, గ్రామ సర్పంచ్ సుంచనకోట అనురాధ కిషన్ గౌడ్, స్థానిక నాయకులు, ఎడపల్లి మండలంలోని జాన్కంపేట్ గ్రామంలో రథం చెరువు వద్ద స్మశాన వాటికకు వెళ్లే దారిలో ఇరుకుగా ఉన్న డి 50కెనాల్ పైఎమ్మెల్యే నిధులు మంజూరు చేయడంతో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు కిషోర్, అలాగే నియోజకవర్గంలో నిధుల మంజూరు సందర్భంగా ఆయా గ్రామాల నాయకులు, ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఐదవ సారి అధ్యక్షుడిగా ఎన్రాల నగేష్



**ప్రజాపక్షం/ ఆదిలాబాద్ రూరల్:** ఆదిలాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఐదవ సారి ఎన్రాల నగేష్ ఎన్నికయ్యారు. గురువారం ఆదిలాబాద్ బార్ అసోసియేషన్లో అధ్యక్షలు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల ఎన్నికలను నిర్వహించారు. ఉపాధ్యక్షులుగా ఠాకూర్ చందుసింగ్, ప్రధాన కార్యదర్శులుగా కేమ శ్రీకాంత్లు గెలుపొందారు. సహాయ కార్యదర్శులుగా కొర్రి రమనయ్య, కోశాధికారినిగా జాదవ్ సంగీత, లేడీ రిప్రజెంటివ్గా పి భావన, లైబ్రేరియన్గా కాప్రే రవీందర్, క్రీడా కార్యదర్శులుగా ముజాహిద్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన సభ్యులకు న్యాయవాదులు, కోర్టు అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ తమపై నమ్మకంతో ఎన్నుకున్నందుకు కృతజ్ఞతులు తెలిపారు. న్యాయవాదుల అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. ఎలక్షన్ ఆఫీసర్గా మదన్మోహన్, అబ్దుల్లాఖాన్, నారాయణస్వామి పాల్గొన్నారు.

## కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా అఖీల్ నియామకం

### ఎంఎల్సి దండే విట్టల్ సమక్షంలో సన్మానం



**ప్రజాపక్షం/సిర్పూర్టి:**సిర్పూర్ టి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా మొహమ్మద్ అబ్దుల్ అఖీల్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఎంఎల్సి దండే విట్టల్ ఆధ్వర్యంలో ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, ప్రజల సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండాలని ఈ సందర్భంగా నాయకులు ఆకాంక్షించారు. అనంతరం ఎంఎ అఖీల్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిర్పూర్ టి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వార్డు సభ్యుల శిక్షణ ముగింపు

**ప్రజాపక్షం/సిర్పూర్టి:** గ్రామ పంచాయతీ సభ్యులు ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాభివృద్ధికి కృషి చేయాలని కాగజ్ నగర్ డిఎల్పిఓ హరి ప్రసాద్ సూచించారు. సిర్పూర్ టి మండల కేంద్రంలోని రైతు వేదికలో గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్న గ్రామ పంచాయతీ వార్డు సభ్యుల శిక్షణా కార్యక్రమాలు గురువారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై శిక్షణ పొందిన సభ్యులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటి సరఫరా, రహదారుల శుభ్రత, విద్యుత్ దీపాలు వంటి మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ముఖ్యంగా 2018 పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం వార్డు సభ్యులు తమ బాధ్యతలను నిర్వర్తించాలని స్పష్టం చేశారు. అనంతరం ఎంపిడిఓ సత్యనారాయణ మాట్లాడుతూ ఈ శిక్షణ ద్వారా సభ్యులు తమ విధులను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అవగాహన లభించిందని పేర్కొన్నారు. ప్రతి సభ్యుడు తమ వార్డు అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిఓ వినోద్ కుమార్, శిక్షకులు, పంచాయతీ కార్యదర్శులు, మండల సిబ్బంది పాల్గొన్నారు.

## పాఠశాల విద్యార్థులకు ప్లేట్లు విరాళం



ప్రజాపక్షం/దిలావర్‌పూర్ : మండలంలోని కంజర్ గ్రామంలో సంక్రాంతి సెలవులలో కేపీఎల్ టోర్నమెంట్ నిర్వహించడం జరిగింది. గెలిచిన టీమ్ సభ్యులకు మొదటి, రెండవ బహుమతులను అందించడం జరిగింది.రెండవ బహుమతి అందుకున్న ప్రీతం కెప్టెన్ టీం సభ్యులు రెండవ బహుమతి డబ్బులతో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు విద్యార్థులకు విరాళంగా అందించడం జరిగింది .ప్రధానోపాధ్యాయులు భోజన్న మాట్లాడుతూ క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతగా గెలిచిన డబ్బులను పాఠశాల విద్యార్థులకు ప్లేట్లు గ్లాసులు అందించడం చాలా సంతోషదకరమని,కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చందు, దయాకర్ రెడ్డి, రాజు టీం తదితరులున్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన రామ్‌కిషన్‌రెడ్డి



ప్రజాపక్షం/సారంగాపూర్ : బిఆర్ఎస్ నాయకులు బాలేరి ప్రవీణ్ కుటుంబాన్ని గురువారం జిల్లా బిఆర్ఎస్ ఇంచార్జ్ రామ్ కిషన్ రెడ్డి పరామర్శించారు. గత వారం క్రితం ప్రవీణ్ మామ తిరుపతి అనారోగ్యంతో మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న ఆయన..నివాసానికి చేరుకుని మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు.మృతుని కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ దేవి శంకర్, లక్ష్మ ణ చందా మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, మాజీ అడెల్లి ఆలయ చైర్మన్ సింగం లక్ష్మీ నారాయణ గౌడ్,ఎదులాపురం ధనుంజయ్, శ్యామ్ రెడ్డి, లక్ష్మణ్, లక్ష్మన్న, గంగయ్య, శ్రీధర్ తదితరులున్నారు.

## బోథ్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు

### వామన్ రావు దేశ్పాండే

ప్రజాపక్షం/బోథ్ : బోథ్ బార్ అసోసియేషన్ 2026–27 సంవత్సరానికి సంబంధించి ఎన్నికలు, ఎన్నిక ఆఫీసర్ న్యాయవాది అంగద్ కేంద్రే ఆధ్వర్యంలో గురువారం జరిగాయి. అనంతరం కొత్తగా ఎన్నుకోబడ్డ బార్ అసోసియేషన్ బాడీని ప్రకటించడం జరిగింది.అధ్యక్షుడిగా వామన్‌రావు దేశ్‌పాండ్, ఉపాధ్యక్షుడిగా దమ్ము పాల్, సెక్రటరీగా ఠాకూర్ రూపేందర్, జాయింట్ సెక్రటరీ గంగాసాగర, కోశాధికారి కుమ్మరి విజయ్, స్పోర్ట్స్ సెక్రెటరీ జమీర్ ఖాన్‌ను ఎన్నుకోవడం జరిగింది. బోథ్ బార్ అసోసియేషన్ న్యాయవాదులు ఎన్నికైన వారికి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో న్యాయవాదులు,వివేక్ సింగ్, హరీష్, మహేష్, సందేశ్ పాల్గొన్నారు.

# ఆయిల్‌పామ్ లక్ష్యసాధనకు ప్రణాళికాబద్ధంగా కృషి




ప్రజాపక్షం/నిజామాబాద్ : నిర్దేశిత లక్ష్యానికనుగుణంగా జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు జరిగేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. క్షేత్ర స్థాయిలో రైతులను ప్రోత్సహిస్తూ జిల్లాలో ఈ యేడాది 7 వేల ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్‌పామ్ సాగు జరిగేలా అంకిత భావంతో పని చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం వ్యవసాయ, ఉద్యానవన, సహకార శాఖల అధికారులతో ఆయిల్‌పామ్ నర్సరీని నిర్వహిస్తున్న ప్రీ యూనిక్ కంపెనీ ప్రతినిధులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఆయిల్‌పామ్ సాగు పురోగతిపై క్లస్టర్ల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయిల్‌పామ్ సాగును ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోందని, ఎంతో లాభదాయకమైన ఈ పంట సాగును చేపట్టి రైతులు ఆర్థిక అభ్యున్నతి సాధించాలన్నదే ప్రభుత్వ సంకల్పమని కలెక్టర్ స్పష్టం చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకుని జిల్లాలో రైతులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఆయిల్‌పామ్ సాగు చేపట్టేలా విస్తృతస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. దీంతో కంపెనీ వారు రైతుల వద్దకే వచ్చి పంట దిగుబడి సేకరించేందుకు ఆస్కారం ఏర్పడుతుందన్నారు. ఇప్పుడు కూడా రైతులకు ఇబ్బంది లేకుండా కలెక్షన్ సెంటర్లను అందుబాటులో ఉంచామని తెలిపారు. 202223 నుండి జిల్లా ఆయిల్ పామ్ సాగుకు శ్రీకారం చుట్టగా ఇప్పటివరకు 2375 మంది రైతులు 6164 ఎకరాల విస్తీర్ణంలో ఈ పంటను సాగు చేస్తున్నారని కలెక్టర్ వివరించారు. మూడు సంవత్సరాలు దాటిన మీదట పంట దిగుబడులు కూడా చేతికందడం ప్రారంభమైందని తెలిపారు. సుమారు 1476 ఎకరాలలో ఆయిల్‌పామ్ గెలలు కోతకు వచ్చాయని, తద్వారా రైతుల ఖాతాలలో 2.50 కోట్ల డబ్బులు కూడా జమయ్యాయన్నారు. అంకాపూర్‌లో మారా గంగారెడ్డి, కోటగిరి మండలం ఎత్తొండలో ఎం. రమాదేవి, అర్గుల్‌లో మధుసూదన్‌రెడ్డి, కొప్పెర్ల గంగారాం తదితర ఆదర్శ రైతులు ఇప్పటికే ఆయిల్‌పామ్ సాగు ద్వారా లాభాలు పొందుతున్నారని రైతులు వారి తోటలను క్షేత్రస్థాయిలో ప్రత్యక్ష పరిశీలన జరిపేలా అధ్యయన యాత్రలు నిర్వహించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. జిల్లాలో ఆయిల్‌పామ్ సాగుకు సరిపడా మొక్కలు అందుబాటులో ఉన్నాయని ఒక్కో మొక్క ధర రూ.193 కాగా రైతులు కేవలం రూ.20 లు చెల్లిస్తే ప్రభుత్వం రూ.173 ల సబ్సిడీ సమకూరుస్తోందన్నారు. సమావేశంలో జిల్లా ఉద్యానవనశాఖాధికారి శ్రీనివాస్, వ్యవసాయాధికారులు గోవిందు, వీరస్వామి, జిల్లా సహకార శాఖాధికారి శ్రీనివాస్‌రావు, ప్రీ యూనిక్ కంపెనీ ఏరియా మేనేజర్ సాయికిరణ్, ఉద్యానవన, వ్యవసాయాధికారులు, ఏఓలు, ఏఈఓలు పాల్గొన్నారు.

# ఎస్ఆర్‌పి 3 గనిలో ఉత్పత్తి సమీక్ష



ప్రజాపక్షం/శ్రీరాంపూర్ : శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ గురువారం ఎస్ఆర్‌పి 3 గనిని సందర్శించి ఇప్పటివరకు సాధించిన ఉత్పత్తి, ఉత్పాదకతపై సమీక్ష నిర్వహించారు. ఆర్థిక సంవత్సరం ముగింపు దశకు చేరుకున్న నేపథ్యంలో రాబోయే ఏడాదికి అనుసరించాల్సిన వ్యూహాలపై గని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా శ్రీ సీమ్ లోని ఎస్ఆర్‌పి 3 ప్యానెల్ పని ప్రదే శాలను పరిశీలించి ప్రస్తుత ఉత్పత్తి తీరు, వర్కింగ్ కండిషన్స్ ను స్వయంగా తనిఖీ చేశారు. సంస్థ లక్ష్యాలకు అను గుణం గా రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించేందుకు ముందస్తు ప్రణా ళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. కొత్త పని ప్రదేశాల అభివృద్ధి పనులు, అనుమతుల ప్రక్రియలో జాప్యం లేకుండా ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గని మేనేజర్ కార్యాలయంలో గ్రూప్ ఏజెంట్, మేనేజర్, సర్వేయర్లతో కలిసి ప్రస్తుత వర్కింగ్ ప్లాన్ చార్టులను పరిశీలించారు. ఈ ఏడాది సాధించిన ఉత్పత్తి, ఓఎంఎస్ వివరాలను తెలుసుకొని రాబోయే ఆర్థిక సంవత్సరానికి అవసరమైన పనిముట్లు, మెటీరియల్స్ ముం దుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఈ కార్య క్రమం లో గ్రూప్ ఏజెంట్ రవికుమార్, గని మేనేజర్ సిహెచ్ వెంక టేశ్వర్ రావు, సర్వేయర్ సుధాకర్ పాల్గొన్నారు.

## బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక అధ్యక్షుడు

### బర్ల శుభకరన్



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : నిర్మల్ జిల్లా బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు గురువారం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. పట్టణంలోని జిల్లా బార్ అసోసియేషన్ కార్యాలయంలో న్యాయవాదులందరి సమక్షంలో ఈ ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు.ఈ సందర్భంగా అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా బర్ల శుభకరన్ ఎన్నికైనట్లు ప్రధాన ఎన్నికల అధికారి వోస మహేందర్, సహాయ ఎన్నికల అధికారి వంగ శ్యామ్ సుందర్ రెడ్డి అధికారికంగా ప్రకటించారు.

**ఏకగ్రీవంగా ఎన్నికైన సభ్యులు..**ఈ ఎన్నికల్లో పలువురు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నిక కావడం విశేషం,నూతన కార్యవర్గ వివరాలు ఇలా ఉన్నాయి. ఈ ఎన్నికల్లో పలువురు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నిక కావడం విశేషం నూతన కార్యవర్గ వివరాలు ఇలా ఉన్నాయి.ఉపాధ్యక్షుడు అబ్బిడి నర్సారెడ్డి,ప్రధాన కార్యదర్శి కటకం అజయ్ కుమార్ సంయుక్త కార్యదర్శి ఆర్.రత్నంరావ్,కోశాధికారి.చిన్నబోని అర్చన,కల్చరల్ సెక్రటరీ పి.వంశీకృష్ణ లైబ్రరీ సెక్రటరీ కే.నివేదిత నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి తోటి న్యాయవాదులు ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు.అసోసియేషన్ బలోపేతానికి,న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి నూతన కార్యవర్గం కృషి చేయాలని వారు ఆకాంక్షించారు.బాధ్యతలు స్వీకరించిన అనంతరం అధ్యక్షుడు శుభకరన్ మాట్లాడుతూ..తన పై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.అసోసియేషన్ అభివృద్ధికి అందరినీ కలుపుకుని ముందుకు సాగుతానని హామీ ఇచ్చారు.

## బైంసాలో పోలీసుల కవాతు



ప్రజాపక్షం/బైంసా : బైంసా పట్టణంలో గురువారం పోలీసుల కవాతు నిర్వహించారు. ఏఎస్పి సాయికిరణ్ ఆధ్వర్యంలో స్థానిక పో లీస్ స్టేషన్ నుంచి పురాణ బజార్,గణేష్ నగర్,గోల్డ్ మార్కెట్,మున్సిపల్ ఆఫీస్,గాంధీ గంజ్ మీదుగా శివాజీ చౌక్ వరకు కవాతు సాగింది. ఈ సందర్భంగా ఏఎస్పీ సాయి కిరణ్ మాట్లాడుతూ శ్రీరామ నవమి పండుగను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవలన్నారు. శ్రీరాముని శోభయాత్రకు భా రీ బందోబస్తు ఉంటుందని వెల్లడించారు.

## నక్కలవడా గ్రామపంచాయతీను సందర్శించిన ఎంపిడిఒ ఎల్.రమేష్



ప్రజాపక్షం/బోథ్ : బోథ్ మండలంలోని నక్కలవాడ గ్రామ పంచాయతీని బోథ్ ఎంపిడిఓ రమేష్ నక్కల్ వాడ సర్పంచ్ నవీన్ కుమార్‌తో కలిసి సందర్శించడం జరిగింది.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి పనులలో భాగంగా ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని తెలిపారు.అదే విధంగా గ్రామ పంచాయతీలోని కొత్త పల్లి గ్రామంలో అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్ ఈ.సి.మధు పాల్గొనడం జరిగింది.

## అరైవ్ అలైవ్‌లో భాగంగా సూచికల ఏర్పాటు

ప్రజాపక్షం/నేరడిగొండ : నేరడిగొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని బంధం ఎక్స్ రోడ్ వద్ద నేరడిగొండ ఎస్సై ఇమ్రాన్ ఖాన్ ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్ రోడ్ సేఫ్టీ లో భాగంగా రోడ్డుపై వాహన చోదకులకు ప్రమాదాలు జరగకుండా సూచిక బోర్డులు కనబడే విధంగా జీబ్రా క్రాసింగ్ లలో పెయింటింగ్ వేయించడం జరిగింది.ఈ కార్యక్రమంలో బంధం సర్పంచ్ గ్రామస్తులు నాయకులు పాల్గొన్నారు.

## గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి

### సింగరేణి డిజిఎం అశోక్

ప్రజాపక్షం/మందమర్రి : గిరిజన విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మందమర్రి ఏరియా డిజిఎం (పర్సనల్) సిహెచ్ అశోక్ అన్నారు. మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్ రాధాకృష్ణ ఆదేశాల మేరకు బెల్లంపల్లిలోని రాంజీ గోండు విద్యార్థి నిలయాన్ని (వనవాసి కళ్యాణ పరిషత్) ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సత్యనారాయణతో కలిసి పాఠశాలలోని తరగతి గదులు, విద్యార్థులకు అందిస్తున్న విద్యా సౌకర్యాలను సమగ్రంగా పరిశీలించి విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి విద్యాభ్యాసం, భవిష్యత్ లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందిస్తున్న భోజన సదుపాయాలు, పరిశుభ్రత ప్రమాణాలను వారు సమీక్షించారు. గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధి, సంక్షేమం కోసం వనవాసి కళ్యాణ పరిషత్ చేస్తున్న కృషిని అధికారులు ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల గౌరవ అధ్యక్షులు విద్యాసాగర్, అధ్యక్షులు రంగ రామన్న, కార్యదర్శి సత్యనారాయణ, ముఖ్య కార్యదర్శి కాసర్ల తిరుపతి, కోశాధికారి సూరం లక్ష్మీ నారాయణ, ఉపాధ్యక్షులు ఆరెపల్లి కొమురయ్య, మహిళా ప్రముఖ రాచకొండ విజయలక్ష్మి పాల్గొన్నారు.

## సిసి రోడ్డు పనుల ప్రారంభం

ప్రజాపక్షం/పెంచికల్‌పేట : గ్రామంలో రహదారి సమస్యలను పూర్తిగా పరిష్కరించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని సర్పంచ్ షేక్ ఉస్మాన్ తెలిపారు. గురువారం పెంచికల్‌పేటలోని అంతర్గత రహదారుల అభివృద్ధిలో భాగంగా నూతన సిసి రోడ్డు నిర్మాణ పనులకు ఆయన కొబ్బరికాయ కొట్టి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎల్‌సి దండే విఠల్ అందించిన ప్రత్యేక సహకారం, నిధుల మంజూరుతో ఈ పనులు ప్రారంభించినట్లు వెల్లడించారు. గ్రామ అభివృద్ధికి ఎంఎల్‌సి అందిస్తున్న మద్దతుకు కృతజ్ఞతలు తెలియజేశారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, ఎక్కడా రాజీ పడకుండా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. వర్షాకాలంలో బురదమయంగా మారే వీధులను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో సిసి రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని వివరించారు. రాబోయే రోజుల్లో గ్రామంలో మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సముద్రాల రాజన్న, ఉప సర్పంచ్ మల్యాల శేఖర్, వార్డు సభ్యులు పురుషోత్తం, సుంకరి చందు, పాముల నందు, పార్టీ కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## శ్రీరామ నవమిని విజయవంతం చేయండి

**ప్రజాపక్షం/ముధోల్ :** మండల కేంద్రమైన ముధోల్ లో నేడు జరిపే రామనవమిని విజయవంతం చేయాలని గ్రామ పెద్దలు కోరారు.శ్రీరామ నవమిని పురస్కరించుకుని శ్రీ రామ మందిరం నుండి గ్రామంలో గల ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు.శోభాయాత్రలో ప్రతి ఒక్కరు పాల్గొని గ్రామ ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు.శోభాయాత్ర అంగరంగా వైభవంగా జరుపనున్నట్లు వెల్లడించారు. ప్రతి ఏటాలాగే నేటి సంవత్సరం సై తం రాముని కళ్యాణ మహోత్సవం వైభవోపేతంగా చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపా రు.

## సిసి రోడ్డు పనులు ప్రారంభం

**ప్రజాపక్షం/భీమ్‌గల్ రూరల్ :** మండలంలోని మెండోరా గ్రామంలో నూతనంగా చేపట్టిన సిసి రోడ్డు పనులు సర్పంచ్ కుంట లక్ష్మీ రమేష్ గురువారం ప్రారంభించి మాట్లాడారు. గంగపుత్రులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తెనుగు సంఘం ఇంటి నుండి గంగమ్మ ఆలయంకు వెళ్లే రోడ్డుకు ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా మంజూరు చేయించి సిసి రోడ్డు పనులను గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులతో కలిసి కొబ్బరి కాయ కొట్టి భూమిపూజ చేశామన్నారు. నిధులు మంజూరు చేయించిన నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్‌కు గంగపుత్ర సంఘం సభ్యులు, గ్రామప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు బాజిరెడ్డి అభిలాష్, పల్లె రాము, షఫీ, బాబురావు, డాక్టర్ సంతోష్‌రెడ్డి, బాలరాజు, ఎల్లయ్య, భూమేష్, సత్యనారాయన, రాజేశ్వర్‌గౌడ్, పల్లె శేఖర్, గంగాధర్, సత్యం, లింబాద్రి, దిలీప్, అంజి, అజయ్, గంగపుత్ర సభ్యులు, ఎర్రన్న, మోహన్, నరేందర్ పాల్గొన్నారు.

## ఇస్రో యాత్రకు విద్యార్థుల ఎంపిక

**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** కుమురం భీం జిల్లా నుండి ఏడుగురు విద్యార్థులను ఇస్రో సందర్శన కార్యక్రమానికి ఎంపిక చేస్తూ ఎస్ఇఆర్‌టి డైరెక్టర్ జి.రమేశ్ ఉత్తర్వులు జారీ చేశారని డిఇఓ కె. లలిత తెలిపారు. ఈ నెల 25 నుండి 27 వరకు జరిగిన యాత్రలో రాష్ట్రంలోని తొమ్మిది జిల్లాల నుండి 8, 9 తరగతుల 72 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. జిల్లాకు చెందిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్లానెటరీ సొసైటీ ఆఫ్ ఇండియా వివిధ పరీక్షల ద్వారా ఎంపిక చేసింది. జన్కాపూర్ జడ్‌పి ఉన్నత పాఠశాల నుండి జంపాల కార్తీక్, లోనారి శివచరణ్, వేంపల్లి జడ్‌పి ఉన్నత పాఠశాల నుండి కుచ్చుల సాక్షిత్, వసాకె దిలీప్, ఆసంపల్లి హర్షిత్, రాస్పల్లి జడ్‌పి ఉన్నత పాఠశాల నుండి ఉల్లి ఆకాష్, కర్నె అంజన్నలు ఎంపికయ్యారు. జిల్లా సైన్సు అధికారి కటుకం మధుకర్ పర్యవేక్షణలో విద్యార్థుల భద్రతా చర్యలు చేపట్టగా అగస్త్య అంతర్జాతీయ ఫౌండేషన్, ప్లానెటరీ సొసైటీ ఆఫ్ ఇండియా సౌజన్యంతో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. యాత్రలో రాకెట్ ప్రయోగాలు, ఉపగ్రహాల నిర్మాణం వంటి ఆధునిక సాంకేతికతలను విద్యార్థులు ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంతో విద్యార్థుల్లో విజ్ఞాన శాస్త్రంపై ఆసక్తి పెరిగిందని ఉపాధ్యాయులు తెలిపారు.

# ఎడపల్లి పిహెచ్‌సిలో మెగా హెల్త్ క్యాంప్



**ప్రజాపక్షం/ఎడపల్లి :** మండల కేంద్రమైన ఎడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యక్రమంలో భాగంగా మెగా హెల్త్ క్యాంపును నిర్వహించారు. ఇందులో మొత్తం 230మంది రోగులకు వివిధ రకాల విభాగాల్లో పరీక్షలు నిర్వహించారు. స్త్రీ వైద్య విభాగం, పిల్లలు విభాగం, ఎముకలు, కీళ్ల విభాగం, జనరల్ విభాగం, కంటి, పంటి విభాగాల్లో ప్రత్యేక నిపుణులు పరీక్షలు జరిపి ఉచిత మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు క్షయ వ్యాధి నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించారు. కార్యక్రమంలో భాగంగా ముఖ్యంగా ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక టీబీ స్టాల్‌ను ఏర్పాటు చేశారు. వ్యాధి సోకే ప్రమాదం ఎక్కువగా ఉన్న వ్యక్తులను గుర్తించి వారికి సక్రియ టిబి స్క్రీనింగ్‌ను నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా లక్షణాలు ఉన్న 11మంది అనుమానిత కేసుల నుంచి స్పుటం నమూనాలను సేకరించి, నిర్ధారణ పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపినట్లు వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తగా నిక్షయ మిత్రగా నమోదైన జీవమ్మ ఇద్దరు టిబి రోగులను దత్తత తీసుకున్నారు. వారు కోలుకునే వరకు అవసరమైన పోషకాహారాన్ని అందిస్తానని ఆమె హామీనిచ్చారు. దత్తత తీసుకున్న రోగులకు అవసరమైన న్యూట్రిషన్ ఫుడ్ బాస్కెట్లను బోధన్ డివిజన్ డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ సమత, పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వినీత్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. టిబి రోగులకు మందులతో పాటు పౌష్టికాహారం ఎంతో అవసరమని, సమాజంలో ఉన్న దాతలు ముందుకు వచ్చి రోగులను ఆదుకోవాలని ఈ సందర్భంగా డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ సమత, సిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వినీత్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకటేష్, సూపర్‌వైజర్ రాజేశ్వర్, దేవేందర్, ఎపిఎం రాజేందర్, టిబి సూపర్ వైజర్ హైమద్, ఎఎన్ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాస్



**ప్రజాపక్షం / జన్నారం :** వేసవి కాలం ప్రారంభమైన నేపథ్యంలో అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాస్ సూచించారు. జన్నారంలోని రామకృష్ణ ఆసుపత్రిలో అగ్నిమాపక కేంద్రం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన అగ్ని ప్రమాదాల నివారణ ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇళ్లలో, దుకాణాలలో విద్యుత్ పరికరాలను జాగ్రత్తగా వినియోగించుకోవాలని, గ్యాస్ సిలిండర్ల వినియోగంలో నిర్లక్ష్యం చేయవద్దని తెలిపారు. అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు భయపడకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని, వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం అందించాలని ఆయన కోరారు. ఆసుపత్రి వంటి రద్దీ ప్రదేశాలలో అగ్నిమాపక పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామకృష్ణ, వైద్య సిబ్బంది, ఫైర్ సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

# డిజిటల్ ఓటుతో ప్రజాస్వామ్య పాఠం

డాక్టర్ ఏనుగు శ్రీకాంత్ రెడ్డి



**ప్రజాపక్షం / జన్నారం :** సాంకేతికతతో పాటు ప్రజాస్వామ్య విలువలను విద్యార్థుల్లో పెంపొందించడం లక్ష్యంగా నిర్వహించిన డిజిటల్ మోక్ ఎలక్షన్స్ కార్యక్రమం విజయవంతమైందని పాఠశాల చైర్మన్ డాక్టర్ ఏనుగు శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. గురువారం జన్నారంలోని స్లేట్ ఎక్సలెన్స్ సిబిఎస్ఇ పాఠశాలలో వికసిత భారత్ లక్ష్యంతో విద్యార్థుల్లో ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ డాక్టర్ ఏనుగు శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతికతను సృజనాత్మకంగా వినియోగిస్తూ భవిష్యత్ భారత నిర్మాణంలో భాగస్వాములు కావాలని, ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రాయోగిక అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు అవసరమని వివరించారు. పాఠశాలను విజ్డమ్, కరేజ్, హార్మొనీ, ఇంటిగ్రిటీ అనే నాలుగు హౌస్‌లుగా విభజించి హౌస్ కెప్టెన్లు, వైస్ కెప్టెన్లు, హెడ్ బాయ్, హెడ్ గర్ల్, వైస్ హెడ్ బాయ్, వైస్ హెడ్ గర్ల్, కల్చరల్ మినిస్టర్, స్పోర్ట్స్ మినిస్టర్ పదవుల కోసం ఎన్నికలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ శిరీన్ ఖాన్ మాట్లాడుతూ ఇలాంటి వినూత్న కార్యక్రమాలు విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యతను పెంపొందిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణ, జాకీర్, అమల్ స్టేన్‌ఫీల్డ్ స్లే, శంకర్, భానుచందర్ పాల్గొన్నారు.

# బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలి

జిల్లా ఎస్పీ జి.జానకి షర్మిల




**ప్రజాపక్షం/బైంసా :** బైంసా పట్టణంలోని ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా బైంసా సబ్‌డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన 9 మంది అర్జిదారుల ఫిర్యాదులను స్వీకరించి,ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించారు. ఫిర్యాదు దారుల ఎదుటే సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి,బాధితులకు చట్టపరంగా అవసరమైన సహాయాన్ని వెంటనే అందించాలని సూచించారు.సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ప్రజలు నిర్మల్ వరకు రావడం కష్టంగా ఉండగా,బైంసాలోనే కౌన్సిలింగ్ కల్పించడం పై ఎస్పీ చూపిన ఆలోచనను బాధితులు సంతృప్తిని వ్యక్తం చేశారు.

**పెండింగ్ ఫిర్యాదులపై సమీక్ష..**

ఈ సందర్భంగా గతంలో గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కర స్థితి,ఇంకా పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని పెండింగ్ లో ఉన్న వాటిని వేగంగా పరిష్కరించాలన్నారు.

## ఎన్ఎస్ఎస్ శిబిరం ప్రారంభం




**ప్రజాపక్షం/భీమ్‌గల్ రూరల్ :** మండలంలోని జాగిర్యాల్ గ్రామంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సేవా పథకం ఎన్ఎస్ఎస్ యూనిట్ కార్యక్రమాన్ని గ్రామసర్పంచ్ గడల ప్రసాద్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డీహెచ్.సతీష్, వీడీసీ వార్డు సభ్యులతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలో వారం రోజుల పాటు నిర్వహించే ఎన్ఎస్ఎస్ శిబిరం యూనిట్ కార్యక్రమం పెట్టడం అదృష్టంగా భావిస్తున్నాను. గ్రామంలో సేవ కార్యక్రమాలు చేయడానికి జాగిర్యాల్ గ్రామాన్ని ఎంచుకున్నందుకు విద్యార్థులకు, అధ్యాపక బృందానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ గ్రామంలో పచ్చదన పరిశుభ్రత, ప్లాస్టిక్ నిషేధిత ప్లాస్టిక్‌తో కలిగే నష్టాలను గ్రామప్రజలకు వివరించాలని విద్యార్థులను కోరారు. కార్యక్రమంలో ఆఫీసర్ సుదర్శన్, ఉపసర్పంచ్ రాజేశ్వర్, అధ్యాపక బృందం, వార్డు సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నిషేధిత ప్లాస్టిక్ గ్లాసుల స్వాధీనం




**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** కాగజ్‌నగర్ పట్టణ మున్సిపాలిటీ పరిధిలో నిషేధిత ప్లాస్టిక్ గ్లాసులను పెద్ద మొత్తంలో స్వాధీనం చేసుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ బి. తిరుపతి తెలిపారు. గురువారం మెయిన్ మార్కెట్ ప్రాంతంలోని జ్యోతి ట్రాన్స్‌పోర్ట్ వద్ద మున్సిపల్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి నిల్వ ఉంచిన ప్లాస్టిక్ గ్లాసులను గుర్తించారు. మున్సిపాలిటీ పరిధిలో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు పేర్కొన్నారు. నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను నిల్వ చేయడం వినియోగించడంపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యాపారస్తులు పర్యావరణ హిత ప్రత్యామ్నాయాలను వినియోగించాలని అధికారులు సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై జరిమానాలు విధిస్తామని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో సానిటరీ ఇన్స్పెక్టర్ ఎం. శంకర్, ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ డి. ప్రణీల్ కుమార్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## కౌటాలను ప్రత్యేక నియోజకవర్గంగా ప్రకటించాలి

మండల నాయకుడు మనోహర్ పటేల్



**ప్రజాపక్షం / కౌటాల :** నియోజకవర్గాల పునర్విభజన జరిగితే కౌటాల మండలాన్ని ప్రత్యేక నియోజకవర్గంగా ప్రకటించాలని సిర్పూర్ నియోజకవర్గ ప్రతిపక్ష నాయకులు మనోహర్ పటేల్ ఎల్కులే డిమాండ్ చేశారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని పెంచికలపేట, కౌటాల, చింతలమానేపల్లి, బెజ్జూర్, దహెగాం, కాగజ్ నగర్ మండలాల పరిధిలోని ప్రాంతాలు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా రవాణా, విద్య, వైద్య రంగాల్లో తీవ్ర కొరత ఉందని, ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు మారినా ప్రాంత అభివృద్ధి జరగలేదని, నాయకులు మాత్రమే లాభపడుతున్నారని విమర్శించారు. కౌటాలను ప్రత్యేక నియోజకవర్గంగా ప్రకటిస్తేనే అన్ని సామాజిక వర్గాలకు సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. బిసి, ఎస్‌సి, ఎస్‌టి, అగ్రవర్ణ వర్గాల ఆర్థిక, సామాజిక, రాజకీయ ప్రగతికి ఇది దోహదపడుతుందని తెలిపారు. స్థానిక నాయకుల నిర్లక్ష్యం వల్ల అభివృద్ధి కుంటుబడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశంలో పార్టీ భేదాలు పక్కనపెట్టి అందరూ కలిసి ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు.